


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


## ఏపీకి శుభవార్త చెప్పిన నితిన్ గడ్కరీ

- మచిలీపట్నం పోర్టుకు రూ. 573.77 కోట్లతో కొత్త రోడ్డు
- 6-లేన్ల ఎక్స్‌టర్నల్ పోర్ట్ కనెక్టివిటీ రోడ్డుకు కేంద్రం ఆమోదం
- జాతీయ రహదారుల నుంచి పోర్టుకు నేరుగా అనుసంధానం
- ఈ ప్రాజెక్టులో 3 ఫ్లైఓవర్లు, ఒక రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం



ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం పోర్టు అభివృద్ధి దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పోర్టుకు మెరుగైన కనెక్టివిటీని


ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 37 | శుక్రవారం 06 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3


# ప్రతి ఎకరాకు నీరందేలా చూడాలి





### నీటి సంరక్షణ మన అందరి బాధ్యత

### సమర్థంగా నీటిని వినియోగిస్తే కరువు రాదు

### సాగునీటి సంఘాల అధ్యక్షుల సమావేశంలో చంద్రబాబు

2లో

ప్రతి ఎకరాకు నీరిచ్చేలా నీటి సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. నీటి భద్రత అందరికీ కావాలి.. కానీ, సంరక్షణను చాలా మంది పట్టించుకోవటం లేదన్నారు. రాష్ట్రంలోని 40 జీవనదుల నీటిని సమర్థంగా నియోగించుకుంటే కరవు అనేదే ఉండదని చెప్పారు. అమరావతిలో జరిగిన నీటి సంఘాల అధ్యక్షుల సమావేశంలో సీఎం మాట్లాడారు. పరుగెత్తే నీటిని నిలపండి, నడిచే నీటిని జలాశయంగా మార్చండి.. భూగర్భ జలాశయంలో నీటి నిల్వ పెరిగేలా చూడాలని తెలిపారు. రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న

# ఆత్మకూరు మున్సిపాలిటీలో ఏసీబీ దాడి...

- లంచం తీసుకుంటూ దొరికిపోయిన కమిషనర్...
- రూ. 20 వేల కోసం ఆశ పడి కటకటాల్లోకి మున్సిపల్ కమిషనర్,బిల్ కలెక్టర్...

2లో



# రాజకీయ కక్షతో క్రిమినల్ కేసులు

### కేసులు కొట్టేయాలంటూ హైకోర్టులో అంబటి పిటిషన్



2లో

మాజీ మంత్రి అంబటి రాంబాబు గురువారం ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అంబటి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం.. ఈ పిటిషన్‌ను విచారించేందుకు అంగీక రించింది. ‌రాజకీయ కక్షసాధింపులో భాగంగా తనపై ఏడేళ్ల లోపు శిక్షపడే సెక్షన్లతో కేసులు నమోదు చేశారని రాంబాబు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసుల్లో ట్రయల్ కోర్టు తనకు రిమాండ్ విధించడాన్ని ఆయన హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తనపై ఉన్న కేసులను కొట్టివేసి, ఊరట కల్పించాలని కోరారు.

### బీజాపూర్ జిల్లా ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ మృతి

ఛత్తీస్‌ఘడ్ బీజాపూర్ జిల్లా తర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్లటూన్-30 కమాండర్ ఉదమ్ సింగ్ మృతి చెందినట్లు ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ 2లో

# వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం పరుగులు



- రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్
- ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది
- 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నాం
- ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణల అమలు
- దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదు
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం
- కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు..ఓట్ బ్యాంక్ రాజకీయాలు
- రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మోడీ
- విపక్షాల నిరసనల...నినాదాలు..చివరకు వాకౌట్

2లో

వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు.

# అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

### యాప్‌ను ప్రారంభించిన అమిత్ షా



ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సేవలు విజయవంతమైన నేపథ్యంలో ఎట్టకేలకు అందుబాటులోకి తెచ్చారు. తొలుత దిల్లీ-రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు లభిస్తాయి. రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు భారత్ ట్యాక్సీ సేవలను తీసుకొస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. ఇందులో లాభాలు డ్రైవర్లకే వెళతాయని చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దేశంలో క్యాబ్ బుకింగ్ సేవల్లో ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయి. డ్రైవర్ల నుంచి ఆయా సంస్థలు కొంతమొత్తం కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. వారి శ్రమను ఆయా కంపెనీలు దోచుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద 2025 జూన్ 5న 'భారత్ ట్యాక్సీ'కి కేంద్రం రూపకల్పన చేసింది. జీరో కమిషన్, సర్జ్‌ప్రైసింగ్ లేని విధానం, డ్రైవర్లకు లాభాలు

2లో



# జంతువుల కొవ్వూ కలిసింది!

- 'నెయ్యి' నమూనాలో ఎస్-వాల్యూ 117
- ఇది పంది కొవ్వు కలిసిందనే సంకేతం
- స్వచ్ఛమైన ఆవునెయ్యి ఎస్-వాల్యూ 104 దాటొద్దు
- అన్ని ప్రమాణాల్లో అంతకుమించే కొవ్వులతో కల్తీ చేశారనేందుకు అదే నిదర్శనం
- కూటమి వచ్చిన కొత్తలోనే ఎన్‌డీడీబీలో పరీక్ష
- నెయ్యి కల్తీని 2022లోనే నిర్ధారించిన సీఎఫ్‌టీఆర్ఐ
- కళ్లుమూసుకున్న నాటి పాలక మండలి, అధికారులు
- అడ్డంగా దొరికిపోయినా బుకాయింపు మానని వైవీ

2లో

వైసీపీ రాజ్యసభ సభ్యుడు, టీటీడీ పాలకమండలి మాజీ అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి అడ్డంగా దొరికిపోయారు. మొన్నటిదాకా 'కల్తీ' మాటెత్తని ఆయన… 'కల్తీ జరిగితే జరిగి ఉండొచ్చు' అని సన్నాయి నొక్కులు నొక్కారు. జంతువుల కొవ్వు కలవలేదంటున్న ఆయన.. పంది కొవ్వు కలిసిందని ఏకంగా జాతీయ పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) ధ్రువీకరించిందని చెప్పగా… 'అది అనుమానం మాత్రమే' అని వెల్లడించారు. అసలు నిజం ఏమిటంటే… జగన్ హయాంలో తిరుమలకు సరఫరా అయ్యింది నెయ్యే కాదు! పామోలిన్ నూనెలో రకరకాల రసాయనాలు కలిపి పంపారు. మరో దారుణమైన సత్యం ఏమిటంటే… 'నెయ్యే కాని ఆ నెయ్యి'లో జంతువుల కొవ్వులూ కలిశాయి. ఇది… అక్షరాలా నిజం. పాడిపరిశ్రమకు సంబంధించిన అత్యున్నత నియంత్రణ సంస్థ 'ఎన్‌డీడీబీ-కాఫ్' ప్రయోగశాలలోనే ఇది రుజువైంది. అందులో… పంది కొవ్వూ (ల్యార్డ్) కలిసిందని తేలింది. అయినా సరే… 'అది అనుమానం' మాత్రమే అని వైవీ సుబ్బారెడ్డి దబాయించడం గమనార్హం.

# కార్మిక సంక్షేమ పథకాల పునరుద్ధరణ

2లో



### అసంఘటిత రంగ కార్మికులను మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లుగా ప్రోత్సహించాలి - కార్మిక శాఖపై సమీక్షలో సీఎం ఆదేశాలు

అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ, ఇతర కార్మికులకు గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రసూతికి రూ.20 వేలు, వివాహానికి రూ.40 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. కార్మిక శాఖపై గురువారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల్లో ఆధునిక నైపుణ్యాలు, జీవన ప్రమాణాలను పెంచే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలు ఎల్ అండ్ టి, ఎన్‌సీసీ, మిట్టల్ సహా వివిధ సంస్థల సహకారంతో వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆధునిక నైపుణ్య శిక్షణ ద్వారా రాష్ట్రంలోని కార్మికులు దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు పొంది, అధిక ఆదాయం ఆర్జించేలా చూడాలన్నారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ డేటాబేసను అనుసంధానించడంతో పాటు కార్మికులు లేటరల్ ఎంట్రీ ద్వారా వివిధ కోర్సులు అభ్యసించి ఉన్నత విద్యార్హతను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గిగ్ వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికుల ఆదాయాలు పెరిగేలా చూడాలన్నారు. ఆధునిక పనిముట్లను కార్మికులకు అందించాలన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం పరుగులు

విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారు. స్వాతంత్ర్యం తొలి నాళ్లల్లో భారత్ ప్రపంచంలో 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు. కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు. ఒకప్పుడు భారత్ బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని చెప్పారు. ప్రపంచ సవాళ్లకు భారత్ పరిష్కారాలు చూపించే స్థితిలో నిలిచి ఒక ఆశాకిరణంగా మారిందని అన్నారు. అధిక వృద్ధి రేటు, తక్కువ ద్రవ్యోల్బణం కలగలిసిన అరుదైన స్థితిలో భారత్ ఉందని అన్నారు. మునుపటి ప్రభుత్వాల తప్పులను సరిచేసేందుకే అధిక శాతం తమ శక్తియుక్తులను వినియోగించాల్సి వస్తోందని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా మూటగట్టుకున్న ప్రతికూల అభిప్రాయాన్ని తొలగించుకుంటున్నామని అన్నారు. ఈ నష్టాన్ని సరిచేసేలా భవిష్యత్తుకు తగిన విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్లోబల్ సౌత్‌గా పేరు పడ్డ దేశాల తరపున భారత్ అంతర్జాతీయ వేదికలపై బలంగా తన వాణిని వినిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు దార్శనికత లేదని విమర్శించారు. ఫలితంగా భారత్ చాలా కాలం పాటు కష్టాలు పడిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా వ్యవస్థలు బలహీనపడతాయని అన్నారు. ప్రపంచంలో అగ్రగామి దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం ఉత్సుకతతో ఉన్నాయని చెప్పారు. ఈయూ ట్రేడ్ డీల్‌తో ప్రపంచంలో స్థిరత్వంపై వివిధ దేశాలకు నమ్మకం పెరిగిందని అన్నారు. అమెరికాతో ఒప్పందంతో ఈ భావన మరింత బలపడిందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్‌పై ప్రధాని మోదీతీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోం దన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. దీనిపై లోక్‌సభలో చర్చ జరగకపోవడం అత్యున్నత పదవికే అవమానకరమన్నారు. దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉంటే.. ఎన్డీయే హయాంలో మూడో స్థానానికి చేరుకోనుంది. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది. గతంలో మనతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. భారత్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి లేదు.

తయారీ రంగంలో బలమైన ఎకో సిస్టమ్ ఉంటేనే ఒప్పందాలకు ముందుకొస్తారు. రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్.. నినాదంతో దూసుకెళ్తున్నాం. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉంది. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. మనదగ్గర యువత జనాభా అధికంగా ఉంది. మన యువతకు ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయి. బ్యాంకుల బలోపేతానికి అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ రంగ సంస్థలకు అండగా నిలిచాం. బ్యాంకుల నుంచి ఇప్పుడు పేదలకు రుణాలు అందుతున్నాయి. ముద్ర యోజన ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. దీని కింద రూ.30లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. 10కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ది పొందారు. 2014 తర్వాత ఎ÷-లానింగ్ కమిషన్‌ను తీసేసి నీతిఆయోగ్‌ను తెచ్చాం. ఇది వేగంగా, సమర్థంగా పనిచేస్తోంది. అక్రమార్కులను రక్షించేందుకు బెంగాల్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అక్రమ వలసదారులను బయటకు పంపించివేస్తున్నాయి. బెంగాల్‌లో మాత్రం అటువంటి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజల హక్కులు హరిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ప్రతి ఎకరాకు నీరందేలా చూడాలి

ఆంధ్రప్రదేశ్‌ను రైతు సానుకూలప్రదేశ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. సాగునీటి సంఘాలకే నామినేషన్ కింద పనులు ఇస్తున్నందున.. ప్రతీ ఎకరాకూ నీరిచ్చేలా పనిచేయాలని సూచించారు. నీటి సంఘాల పనులకు జీఎస్టీ లేకుండా చూస్తామని తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో చేసిన పనులకు కూడా చెల్లింపులు చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని పేర్కొన్నారు. నీటి పన్నులు కూడా వసూలు చేసుకుని సమర్థంగా కాలువల నిర్వహణ చేసుకోవచ్చని వెల్లడించారు. 6,700 నీటి వినియోగదారుల సంఘాలు, 58 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించామని గుర్తు చేశారు. సరైన సమయానికే రబీ, ఖరీఫ్ సాగు కోసం నీరు ఇచ్చేలా ప్రణాళిక చేద్దామని పిలుపునిచ్చారు. వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు కూడా రైతులు దృష్టి సారించాలని కోరారు. తద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందేలా కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. రైతులు ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నీటి వినియోగదారుల సంఘాలు కూడా వివిధ బాధ్యతలు తీసుకోవాలన్నారు. భూగర్భ జలాలు పెంచే బాధ్యతతో పాటు కాలువలు, ప్రాజెక్టుల ద్వారా నీటి నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు మున్సిపాలిటీలో ఏసీబీ దాడి...



**ఆత్మకూరు, నంద్యాల జిల్లా :** ప్రభుత్వ కార్యాలయాలను అవినీతి అడ్డాగా మార్చుకున్న అధికారులపై ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) ఉక్కుపాదం మోపింది. ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, బిల్ కలెక్టర్ భాస్కర్ తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని సామాన్యులను పీడిస్తున్న వైనం తాజాగా బట్టబయలైంది. కేవలం 20 వేల రూపాయల లంచం కోసం కక్కుర్తి పడి, ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడటం జిల్లావ్యాప్తంగా సంచలనం రేపింది.

**వివరాల్లోకి వెళితే..** ఆత్మకూరు పట్టణానికి చెందిన సాజిద్ అనే వ్యక్తి ఒక ఫంక్షన్ హాల్ నిర్మాణం నిమిత్తం మున్సిపల్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు మరియు బిల్ కలెక్టర్ భాస్కర్ సదరు ఫైలును ముందుకు కదపకుండా ముప్పుతిప్పలు పెట్టారు. పని పూర్తి కావాలంటే రూ. 20,000 లంచం సమర్పించుకోవాలని వేధించారు.అధికారుల వేధింపులతో విసిగిపోయిన సాజిద్ ఏసీబీని ఆశ్రయించాడు. పక్కా వ్యూహంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, గురువారం సాజిద్ నుండి రూ. 20,000 లంచం తీసుకుంటుండగా రమేష్ బాబు,భాస్కర్ లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వారి చేతులకు ఉన్న రసాయనం రంగు మారడంతో అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

# జంతువుల కొవ్వూ కలిసింది!

ప్రపంచంలో ఏ ప్రయోగ శాల అయినా... తన పరీక్షల ఫలితాలను 'ఇదే ఫైనల్' అని చెప్పదు. చివరికి... మనం రక్తపరీక్ష చేయించుకున్నప్పటికీ 'కో రిలేట్' చేసుకోవాలని రిపోర్టులో ఉంటుంది. నెయ్యికి సంబంధించి ఎన్‌డీడీబీ నివేదికలో 'సస్పెక్టెడ్' అనే పదానికి అర్థం కూడా అదే! ఎన్‌డీడీబీ చెప్పిందిదే... 'స్వచ్ఛమైన ఆవు నెయ్యి' అంటూ జగన్ హయాంలో ట్యాంకర్ల కొద్దీ కల్తీ నెయ్యిని టీటీడీకి సరఫరా చేశారు. అప్పటికే వచ్చిన ఫిర్యాదులు, బలమైన అనుమానాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీటీడీ అధికారులు 'నెయ్యి' శాంపిళ్లను ఎన్‌డీడీబీ ప్రయోగశాలకు పంపించారు. అందులో నివ్వెరపోయే వాస్తవాలు బయటపడ్డాయి. అందులో... బీటా సిటోస్టిరాల్, లారిక్‌యాసిడ్, లిగ్నోసెరిక్ యాసిడ్ వంటివి పరిమితికి మించి ఉన్నాయని తేల్చింది. చివరికి, జంతువుల కొవ్వు, పంది కొవ్వూ (ల్యార్డ్) ఉందని నిర్ధారించింది. ఆవు నెయ్యి స్వచ్ఛతను 'ఎస్-వాల్యూ' ఆధారంగా గుర్తిస్తారు. ఒక ప్రమాణం ప్రకారం... ఎస్-వాల్యూ 97.96 నుంచి 102.04 మధ్య ఉండాలి. కానీ... ఏకంగా 117.15 ఉన్నట్లు తేలింది. పంది కొవ్వు (ల్యార్డ్) కలిపితేనే ఇంత ఎస్-వాల్యూ వస్తుంది. ఎప్పుడో కల్తీ తేలినా... వైవీ సుబ్బారెడ్డి టీటీడీ అధ్యక్షుడిగా ఉండగానే... కల్తీ బండారం బయటపడింది. టీటీడీకి సరఫరా చేసిన 3 ట్యాంకర్లు, ఒక టిన్ నెయ్యిని 2022 జూన్ 8న పరీక్షించగా... అందులోనూ కల్తీ జరిగిందని కేంద్ర ఆహార-సాంకేతిక పరిశోధనా సంస్థ (సీఎఫ్‌టీఆర్ఐ) నిర్ధారించింది. 2022 ఆగస్టు 3న టీటీడీకి నివేదించింది. మరి... కల్తీ నెయ్యి సరఫరా చేసిన డెయిరీలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అని ప్రశ్నిస్తే, 'నాకేం తెలియదు. అంతా అధికారులే చూసుకోవాలి" అని వైవీ సుబ్బారెడ్డి చెబుతున్నారు. 'నెయ్యి కల్తీ జరిగింది' అని కేంద్ర ప్రభుత్వ పరిశోధనా సంస్థ చెప్పినా పట్టించుకోకపోవడం నిర్లక్ష్యం కాదా? చైర్మన్ హోదాలో ఆయన ఏం చేసినట్లు? కల్తీని నిర్ధారించే 2 నివేదికలు కళ్లముందున్నా వైవీ కప్పదాట్లు ప్రదర్శిస్తున్నారు. **ఎన్‌డీఆర్ఐ... ఎందుకిలా?** సీఎఫ్‌టీఆర్ఐతోపాటు ఎన్‌డీడీబీ ప్రయోగశాలల్లో కల్తీ నిర్ధారణ అయినప్పటికీ..

. 'సిట్' మరోసారి శాంపిళ్లను హరియాణాలోని ఎన్‌డీఆర్ఐకి పంపింది. ఆ సంస్థ...అటూ ఇటూ తేల్చని ఒక అసహాయ నివేదికను ఇచ్చింది. అసలు విషయం ఏమిటంటే...టీటీడీకి నెయ్యి కొనుగోలు టెండర్ నిబంధనలు సడలించిన సమయంలో...ఆ తర్వాత బోలేబాబా, దాని అనుబంధ డెయిరీల తనిఖీకి నియమించిన బృందంలో ఎన్‌డీఆర్ఐకి చెందిన ఇద్దరు అధికారులూ సభ్యులుగా ఉన్నారు. 'అంతా ఓకే' అంటూ గేట్లు ఎత్తేశారు. ఇప్పుడు అదే ఎన్‌డీఆర్ఐ... నిక్కచ్చిగా నివేదిక ఇస్తుందని ఎలా ఆశించగలం!?

# బీజాపూర్ జిల్లా ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ మృతి

తెలిపారు.బీజాపూర్ జిల్లాలో గురువారం ఉదయం నుంచి భద్రత బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. డీఆర్‌జీ (డిస్ట్రిక్ రిజర్వ్ గార్డు) సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. పెద్దగెల్లూరు అడవిలో మావోయిస్టులు ఉన్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో బలగాలు ఆ ప్రాంతంలో ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఇరు వర్గాలకు మధ్య కాల్పులు జరిగాయి. అయితే ఘటనాస్థలి నుంచి ఆటోమేటిక్ ఏకే-47 రైఫిల్‌తో పాటు పలు ఆయుధసామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

పంచిపెట్టడం దీని ముఖ్య ఉద్దేశం. దిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్‌లో డిసెంబర్ 2 నుంచి ప్రయోగాత్మకంగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల డ్రైవర్లు ఇందులో చేరగా.. లక్ష మంది యూజర్లు రిజిస్టర్ అయ్యారు. రోజుకు 10 వేల రైడ్లు జరిగాయి. సుమారు రూ.10 కోట్లను డ్రైవర్లకు లాభాలుగా అందినట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పేర్కొంది. డ్రైవర్లకు 'సారథి' పేరిట ఆరోగ్య, ప్రమాద బీమా, రిటైర్మెంట్ సేవింగ్స్ కూడా లభిస్తాయి.

# కార్మిక సంక్షేమ పథకాల పునరుద్ధరణ

నైపుణ్యాలు పెరిగితే అధిక ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని 20 లక్షల మంది కార్మికులకు నైపుణ్యాలు పెంచేందుకు అనువుగా కార్యాచరణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న భారీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కూడా మన యువతకు అవసరమన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులను మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లుగా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించాలని, యూనివర్సల్ హెల్త్ పాలసీతోపాటు కార్మిక శాఖ ద్వారా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు, ఆపై ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా భరించేలా చూడాలని స్పష్టం చేశారు.

# ఏపీకి శుభవార్త చెప్పిన నితిన్ గడ్కరీ

అందించేందుకు రూ. 573.77 కోట్ల వ్యయంతో 6-లేన్ల ఎక్స్‌టర్నల్ పోర్ట్ కనెక్టివిటీ రహదారి నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా వివరాలు వెల్లడించారు.ఈ ప్రాజెక్టులో భాగంగా, జాతీయ రహదారి-216లోని మచిలీపట్నం బైపాస్ సెక్షన్ మీదుగా జాతీయ రహదారి-65, జాతీయ రహదారి-216 కూడలి నుంచి మచిలీపట్నం పోర్టు వరకు ఈ 6-లేన్ల రహదారిని నిర్మించనున్నారు. దీనివల్ల జాతీయ రహదారుల కారిడార్ నుంచి పోర్టుకు నేరుగా, వేగవంతమైన రవాణా సౌకర్యం కలుగుతుందని గడ్కరీ తెలిపారు. ఈ రహదారి నిర్మాణంతో సరుకు రవాణా వాహనాల ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని, నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఆమోదం పొందిన ప్రాజెక్టులో 6-లేన్ల ప్రధాన రహదారితో పాటు సర్వీస్ రోడ్లు, 3 ఫ్లైఓవర్లు, ఒక ఓవర్‌పాస్ కమ్ రైల్వే ఓవర్‌బ్రిడ్జి (=ాదీ) నిర్మాణం కూడా ఉన్నట్లు కేంద్రమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మచిలీపట్నం పోర్టు లాజిస్టిక్స్ సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# తెలంగాణకు 4 వారాల్లో రెగ్యులర్ డీజీపీ

తెలంగాణలో రెగ్యులర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) నియామక ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తిచేయాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)ను సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వాలకు రెగ్యులర్ డీజీపీల నియామకం ఇష్టం ఉండదని, ప్రభుత్వాల ట్రాప్‌లో యూపీఎస్సీ పడొద్దని సూచించింది. పలు రాష్ట్రాల్లో యాక్టింగ్ డీజీపీలను నియమించడంపై అసహనం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో అన్ని అర్హతలున్న సీనియర్ అధికారులకు నష్టం జరుగుతోందని తెలిపింది. గత ఏడాది సెప్టెంబర్ 26న డీజీపీ జితేందర్ పదవీ విరమణ చేయడంతో, 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి శివధర్ రెడ్డికి ప్రభుత్వం డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నియామకం 'ప్రకాశ్ సింగ్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధమని సామాజిక కార్యకర్త టి.ధనగోపాల్‌రావు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు.

# సంఘటిత పోరాటాన్ని తప్పనిసరి చేస్తున్న లేబర్ కోడ్లు!

వలస పాలన కాలం నాటి కార్మిక చట్టాలను మార్చామని బీజేపీ పాలకులు జబ్బలు చరుచుకుంటున్నారు. కానీ కొత్త లేబర్ కోడ్లల్లో కూడా తేడా ఏమీ లేదు. పైగా కార్మికుల ట్రేడ్-యూనియన్ హక్కుకు, సమ్మె హక్కుకు మరిన్ని సంకెళ్ళు వేసారు. యాజమాన్యాలపై ప్రభుత్వ పర్యవేక్షణను మరింత బలహీనం చేసారు. గతంలో కొన్ని షెడ్యూల్ పరిశ్రమల్లో మాత్రమే వర్తించే 'కనీస వేతనాలను' ఇప్పుడు కార్మికులందరికీ వర్తింపచేసాం అని కేంద్ర ప్రభుత్వం గొప్పలు పోతోంది. నిజమే. అయితే ప్రస్తుత చట్టం ప్రకారం కూడా కనీస వేతనాలను అనేక యాజమాన్యాలు అమలుచేయటం లేదు. అమలుకు ప్రభుత్వాలూ సరైన చర్యలు తీసుకోవటం లేదు. ఈ కనీస వేతనాల్లో మూలవేతనాన్ని ప్రభుత్వం కనీసం అయిదేళ్లకు ఒకసారి పెంచాలి. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని పరిశ్రమల్లో 2007, మరికొన్ని పరిశ్రమల్లో 2011 తరువాత నేటికీ వీటిని ప్రభుత్వాలు సవరించలేదు. ఇక ఈ కనీస వేతనాలు నిర్ణయించడానికి సంబంధించి అనేక సమస్యలున్నాయి. ఉదాహరణకు ఈ రోజు ఉద్యోగంలో చేరినవారికీ, రేపు రిటైర్ అయ్యేవారికీ ఒకటే కనీస వేతనం! ఇటువంటి అనేక సమస్యలకు కొత్త లేబర్ కోడ్‌లలో కూడా ఎలాంటి పరిష్కారమూ లేదు. ఇక గిగ్, ప్లాట్‌ఫాం తదితర అసంఘటితరంగ కార్మికులకు కొత్త కోడ్‌లలో కల్పించామన్న 'సామాజిక భద్రత' సంగతి కూడా ఇంతే. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ చట్టాలు ఇప్పటికే లక్షలాది కార్మికులకు అమలు కావటం లేదు. వీటిలోని వివిధ సీలింగులను కొనసాగించడంవల్ల అవి చాలా శాతం కార్మికులకు వర్తించవు. ఇక ఈ 'సామాజిక భద్రత' గతి ఎలా వుంటుందో ఊహించవచ్చు. ఒక సంవత్సరం పని చేస్తే గ్రాట్యుటీ చెల్లించే విధంగా చట్టాన్ని మార్చామని అంటున్నారు. ఇది కార్మికులందరికీ వర్తించదు. కేవలం 'ఫిక్స్‌డ్ టర్మ్' కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ గ్రాట్యుటీ చక్కెరపూతతో 'ఫిక్స్‌డ్ టర్మ్' చేదుమాత్రను మింగిస్తున్నారు. నిజానికి చాలా కాలంగానే అనేక యాజమాన్యాలు ఈ పద్ధతిని అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని ఏపీఎస్ఆర్టీసీలో కూడా దీన్ని అమలు చేసారు. ఇప్పుడు ఈ పద్ధతికి మరింత గట్టి చట్టబద్ధతను కల్పించారు. కార్మికులకు ఎలాంటి ఉద్యోగ భద్రతా లేకుండా చేసే మార్పు ఇది. కొత్త కోడ్‌లలో 'కోర్' (కీలక) విభాగాల్లో కాంట్రాక్టు కార్మికుల నియామకాన్ని నిషేధించామని అంటున్నారు. ఈ 'కోర్' విభాగాలేమిటో చట్టంలో చెప్పలేదు. వీటిని మళ్ళీ ఆయా ప్రభుత్వాలు నిర్ణయించాలి. కాగా, సంవత్సరమంతా కొనసాగే లోడింగ్, అన్‌లోడింగ్, శానిటేషన్ వగైరా ముఖ్య విభాగాలు 'కోర్' విభాగాలు కాదని లేబర్ కోడ్‌లలో ప్రకటించేసి, ఆ పనుల్లో కాంట్రాక్టు కార్మిక విధానాన్ని చట్టబద్ధం చేసేసారు. వందమందికి పైగా ఉన్న పరిశ్రమలను మూత పెట్టడానికి పాతచట్టం ప్రకారం ప్రభుత్వ అనుమతి కావాలి. ఈ సంఖ్యను 300 చేసారు. దీంతో అత్యధిక శాతం పరిశ్రమల్లో కార్మికులు దీని పరిధిలోకి రారు. యాజమాన్యం పరిశ్రమ మూసివేతకు అనుమతి కోసం దరఖాస్తు చేసిన 90 రోజుల తర్వాత ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా ఇచ్చినట్లే భావించాలని అదే చట్టంలో పేర్కొన్నారు. అనుమతి లేకుండా వేలాది పరిశ్రమలు మూతపెట్టబడి, చట్టం ప్రకారం పరిహారం దక్కక, దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరిగే కార్మికుల కథలకు కొదవలేదు. పరిహారం ఇవ్వకుండా కార్మికులను తొలగించడానికి పెద్ద పెద్ద ఐటీ కంపెనీలతో సహా అనేక యాజమాన్యాలు కార్మికులనే రాజీనామాలు చెయ్యాలని ఒత్తిడి చేస్తున్నాయి. బ్యాంకు బకాయిలు తీర్చలేక దివాలా తీసిన పరిశ్రమల్లో కార్మికుల బకాయిల వసూలు అసాధ్యం అయ్యేలా కొత్త దివాలా చట్టాలు, నిబంధనలు తెచ్చారు. పాత, కొత్త కార్మిక చట్టాల్లో కార్మికుల హక్కుల గురించిన వాస్తవ పరిస్థితికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ కారణంగానే కార్మిక సంఘాలు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడవలసివస్తోంది.

ఎనిమిది గంటల పనిదినం, శ్రమకు తగిన న్యాయమైన వేతనం, భద్రతగల పనిపరిస్థితులు, న్యాయబద్ధమైన సర్వీసు రూల్స్, రిటైర్మెంట్ తర్వాత తగిన కనీస పెన్షన్ వగైరాలు వేటినీ చట్టాలు, నిబంధనలు లోగడ గ్యారంటీ చేయలేదు; రేపూ చేయలేవు. కార్మికుల, ప్రజల ప్రయోజనాలు మాత్రమే లక్ష్యంగా పనిచేసే నిజమైన ప్రజాస్వామిక రాజకీయవ్యవస్థ మాత్రమే వాటిని గ్యారంటీ చేయగలుగుతుంది. అటువంటి వ్యవస్థకోసం రైతాంగం, గ్రామీణ పేదలు, తదితర కోట్లాది శ్రమజీవులతో భుజం భుజం కలిపి పోరాడటం తప్ప కార్మికవర్గానికి మరో ప్రత్యామ్నాయం లేదు.



## బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయండి

దేశంలో వెనుకబడిన వర్గాల(బీసీల) అభివృద్ధి కోసం బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో సుమారు 56 శాతం ఉన్న బీసీల అభివృద్ధి కోసం కేంద్ర స్థాయిలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం సమంజసం కాదని అన్నారు. గురువారం రాజ్యసభలో జీరో అవర్‌లో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖలు ఉన్నప్పుడు జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల కోసం మంత్రిత్వ శాఖ ఎందుకు లేదని ప్రశ్నించారు. బీసీలకు జాతీయ బీసీ కమిషన్, బీసీ కార్పొరేషన్ ఉన్నప్పటికీ విద్యా, ఉపాధి రంగాల్లో అనేక న్యాయపరమైన వివాదాలు, సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బీసీల విద్య, ఆర్థిక, ఉపాధి రంగాలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారానే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు.

## బాలికలకు సైబర్ భద్రత, పోక్సో చట్టాలపై ఎస్సై అవగాహన..ఎస్ ఐ నాగార్జున



నంది పత్రిక–ప్యాపిలి నేటి సమాజంలో సాంకేతికతతో పాటు పొంచి ఉన్న ప్రమాదాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని ప్యాపిలి ఎస్సై నాగార్జున సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఆయన మండలంలోని పోతుదొడ్డి గ్రామంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం,బాల్య వివాహాలు చిన్న పిల్లలపై జరిగే లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోక్సో) గురించి వివరిస్తూ, ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయం వీడి పోలీసులకు ఉపాధ్యాయులకు తెలియజేయాలని కోరారు. అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, ఫోటోలను పంచుకోవద్దని ఎస్సై హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. "విద్యార్థినులు చదువుతో పాటు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలి. గ్రామంలో పాఠశాల పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల పరిధిలో ఈ నెల 10 వరకు సభలు సమావేశాలు రద్దు....




కర్నూలు నంది పత్రిక.....ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యుల ఎన్నికలు 9వ తేదీన నిర్వహిస్తున్నందున మెడికల్ కళాశాల యందు సభలు సమావేశములు కాన్ఫరెన్స్ లు నిర్వహించరాదని ఏడియంఇ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా.కె.చిట్టి నరసమ్మ అన్నారు.. మెడికల్ కౌన్సిల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మెడికల్ కళాశాల ప్రాంగణంలో వైద్యుల సభలో సమావేశాలు నిర్వహించరాదని ఏపీ మెడికల్ కౌన్సిల్ సూచనలు జారీ చేసిందని ఇప్పటికే తేదీ నిర్ణయనమైన ఆర్తో కాన్ఫరెన్స్ పోస్ట్ చేసుకోవడం జరిగిందని, అనుమతులు తీసుకున్న సమావేశాలు కూడా 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## టిడిపి తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

**టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు, పాణ్యశీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి . మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ,**



కర్నూలు నంది పత్రిక.... టిడిపి తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిఅన్నారు. అనంతరం ఆమె కల్లూరు అర్బన్, 36వ వార్డ్ హోసన్న మందిరం,మల్లారెడ్డి వెంచర్ ఫేస్–1 లో రూ. 60 లక్షల నిధులతో డ్రైనేజీ కాలువల నిర్మాణం మరియు 37 వ వార్డ్ ,శ్రీనివాస నగర్,భారత్ పెట్రోల్ బంకు లైన్ లో రూ. 1కోటి,80 లక్షల నిధులతో డ్రైనేజీ కాలువల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమశీలో ముఖ్య అతిథులుగా పాల్గొని, శంకుస్థాపనలు చేసిన టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు, పాణ్యశీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి . మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ, మరియు ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జి జనార్ధన్ ఆచారి , 37 వ వార్డు ఇన్చార్జి సుతారు రాఘవేంద్ర , 41 వ వార్డు ఇన్చార్జి నాగేశ్వరరావు , సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు, పాల్గొన్నారు.



# ఘనంగా ఎబి బర్ధన్ నగర్ ద్వితీయ వార్షికోత్సవ సభ



**ఎబి బర్ధన్ నగర్ లో నివాసం ఉంటున్న చోటనే ఇంటి పట్టాలు పక్కా ఇల్లు మంజూరు చేయాలి సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్**

బద్వేల్ ఫిబ్రవరి 05నంది పత్రిక : సమావేశాన్ని ఉద్దేశించి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కడపజిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ.. బద్వేల్ నియోజకవర్గంలోని గోపవరం మండలం పి పి కుంట వద్ద 5. 2. 2024 తేదీ నాడు గోపవరం మండలంలోని అన్ని గ్రామాల అర్హులైన పేద ప్రజలతో ఆనాడు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో జండా పాతి గుడిసెలు వేయించడం జరిగింది నాటి నుండి నేటి వరకు ఆ భూమిని కాపాడుకోవడానికి ఆ గ్రామాల ప్రజలు అటు అధికారులతో ఇటు రాజకీయ పార్టీ నాయకులతో అనేక ఆటుపోట్ల మధ్య ఇబ్బందులు పడుతూ రాత్రనకా పగలనకా ఎండనక వాననక అనేకమైనటువంటి సమస్యలతోటి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అక్కడే స్థిర నివాసం ఉంటున్న పేద ప్రజలకు ఇంటి పట్టా కానీ పక్కా ఇండ్లు కానీ మౌలిక సదుపాయాలైనటువంటి రోడ్లు డ్రైనేజీ కరెంటు వీధిదీపాలు ఎలాంటి సదుపాయాలు కల్పించకపోవడంలో అటు రెవెన్యూ అధికారులు ఇటు రాజకీయ నాయకులు అందరూ విఫలమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో ఇచ్చినటువంటి గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాల రెండు సెంట్లు ఇస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ఏ బి బర్ధన్ నగర్ వాసుల గోడు వినపడకపోవడం సిగ్గుచేటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు అక్కడ ప్రజలు అనేకమార్లు గోపవరం తాసిల్దార్ కార్యాలయాలు చుట్టూ ఆర్డీవో కార్యాలయం చుట్టూ మరియు కడప కలెక్టరేట్ వరకు అనేకమార్లు అర్జీ రూపంలో ధర్నాల రూపంలో దీక్షల రూపంలో నిరసనలు తెలియజేసినప్పటికీ ఏ ఒక్క అధికారి పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్య అని ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మొద్దు నిద్ర విడిచి ఆ ఖాళీలలో నివాసం ఉంటున్న అర్హులైన వారందరికీ ఇంటి పట్టా పక్కా ఇల్లు మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలని ఆయన డిమాండ్



చేశారు. అంతేకాకుండా స్థానికంగా ఉన్నటువంటి అటు వైసిపి ఇటు టిడిపి నాయకులంతా ఒక్కటిగా అయ్యి కోట్లాది రూపాయలు విలువ చేసే ఆ భూమిని ఏదో విధంగా కబ్జా చేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని వారిపై దృష్టి సాధించి కబ్జాకు పాల్పడుతున్నటువంటి భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెట్టి అక్కడి పేద ప్రజలకు తక్షణమే వాళ్ళ సమస్యలకు పరిష్కారం చూపాలని వారు కోరారు. లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో కడప జిల్లా వ్యాప్తంగా విస్తృతమైన ఉద్యమాలు చేపడతామని వారు రెవెన్యూ అధికారులను హెచ్చరించారు

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి వీరశేఖర్ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ ఏరియా సహాయ కార్యదర్శిలు పివి రమణ ఇమ్మానియేల్ గోపవరం మండల కార్యదర్శి పెంచలయ్య జిల్లా సమితి సభ్యులు పడిగే వెంకటరమణ నాగరాజు విజయమ్మ ఏరియా కార్యవర్గ సభ్యులు ఖాదర్ భాష సలోమి ఓబులమ్మ శాఖ కార్యదర్శులు వెంకటయ్య ఓబులేసు కమిటీ సభ్యులు పెంచలయ్య వెంకటేశు లక్ష్మమ్మ సుప్రజ రమాదేవి బి బి మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు





## మహాశివరాత్రికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు



నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 05 . (నంది పత్రిక ):మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాల జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలైన శ్రీశైలం, మహానంది, ఓంకారం, యాగంటిలకు వెళ్లే భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు నంద్యాల జిల్లా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రజియా సుల్తానా తెలిపారు. ఈ మేరకు ఆమె విలేకరుల సమావేశంలో వివరించారు.పండుగ సందర్భంగా బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయడం లేదని, యథాతథంగా సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. అలాగే ప్రయాణికుల సౌలభ్యం కోసం బస్సుల్లో ఫోన్‌పే ద్వారా చెల్లింపుల సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరాన్ని బట్టి అదనపు బస్సులు నడపడంతో పాటు, భద్రతా ఏర్పాట్లు కూడా చేసినట్లు వెల్లడించారు. భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## వైభవంగా డోన్ సింగిల్ విండో పాలకవర్గ ప్రమాణ స్వీకారం

**ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి**



నందిపత్రిక –డోన్ డోన్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం పట్టణంలో అత్యంత వైభవంగా జరిగింది. సంఘం చైర్మన్‌గా ఎన్నికైన శ్రీ చనుగొండ్ల శ్రీరాములు మరియు కమిటీ సభ్యులు ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ సహకార సంఘాలు కేవలం సంస్థలుగా కాకుండా, రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే సాధనాలుగా పనిచేయాలి. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందన్నారు. రైతులకు అవసరమైన రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చూడాలని చైర్మన్ శ్రీరాములును, కమిటీ సభ్యులను కోరారు. డోన్ ప్రాంత రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు మరియు సహకార సంఘం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చైర్మన్ చనుగొండ్ల శ్రీరాములు తనపై నమ్మకంతో చైర్మన్ బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యే కు, సభ్యులకు శ్రీరాములు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి, వారి అభ్యున్నతికి నిరంతరం అందుబాటులో ఉంటూ పారదర్శకంగా పనిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ లెక్క సాగరం లక్ష్మిరెడ్డి, వలసల రామకృష్ణ, ఫణి రాజ్, హరికిషన్, సీమ సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాఘవేంద్ర గౌడ్, కుమ్మరి సుధాకర్, శేషఫణి గౌడ్, వెంకట్ రమణ గౌడ్,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సుచిర్ ఇండియా ఫౌండేషన్ అవార్డు అందుకున్న పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 5 ( నంది పత్రిక ) ఉభయ తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఉత్తమ డైరెక్టర్ గా చాత్రాలయ పురస్కార అవార్డును నంద్యాల జిల్లాలోని శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి అందుకున్నారు. హైదరాబాద్ లోని లలిత కళా తోరణం పబ్లిక్ గార్డెన్లో నిర్వహించిన సుచిర్ ఇండియా అవార్డు ప్రధానోత్సవంలో ఉత్తమ డైరెక్టర్ గా ఛాత్రాలయ పురస్కారం అవార్డును పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డికి ఫౌండేషన్ చైర్మన్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులైన ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్, మాజీ మంతి గంటా శ్రీనివాస రావు, శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, ప్రముఖ సినీ నటుడు శివాజీ రాజా చేతుల మీదుగా అందుకున్నారు. అతిథులు మాట్లాడుతూ నూతన విద్యా బోధనకు రోల్ మోడల్ గా నిలిచి బ్యాంకింగ్ రంగంలో విశేష కృషి చేస్తూ విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా శిక్షణ అందిస్తున్నారని కొనియాడారు. తన తండ్రి గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి బాటలో ఆయన కుమారుడు విద్యాసంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి నడుస్తూ నిరుద్యోగులను ఉద్యోగులుగా చేయడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. అత్యుత్తమ విద్య ప్రమాణాలకు మార్గదర్శకులుగా నిలుస్తున్న పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డికి సుచర్ ఇండియా ఫౌండేషన్ తరపున ఉత్తమ ఛాత్రాలయ పురస్కారం అందించారు.




## మూలపేట పోర్టులో చరిత్రాత్మక ఘట్టం.. తొలిసారిగా బెర్త్‌కు చేరిన 'విశ్వతేజ' డ్రెడ్జర్

శ్రీకాకుళం జిల్లా రూపురేఖలను మార్చబోయే మూలపేట పోర్టు నిర్మాణంలో ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ పోర్టు ప్రాజెక్టును నిర్మిస్తున్న కాంట్రాక్టు సంస్థ విశ్వసముద్ర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన 'విశ్వతేజ' అనే డ్రెడ్జర్ తొలిసారిగా పోర్టు బెర్త్‌కు చేరుకుంది. ఈ పరిణామం, జిల్లా అభివృద్ధిలో ఒక కీలక మలుపుగా నిలవనుందని నిపుణులు అభివర్ణిస్తున్నారు. పోర్టు నిర్మాణ పనులు తుది దశకు చేరుకుని, ఇక కార్యాచరణకు సిద్ధమవుతోందనడానికి ఈ సంఘటన ఒక బలమైన సంకేతంగా నిలుస్తోంది.

# నగర ప్రజలపై భారం పడకుండా వనరుల సాధన కోసం కృషి చేయాలి




## మేయర్ డాక్టర్ శిరీష

## నగర అభివృద్దే ధ్యేయంగా బడ్జెట్ రూపకల్పన = కమిషనర్ ఎన్.మౌర్య.

**తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 5 నంది పత్రిక** నగర ప్రజలపై భారం పడకుండా వనరుల సాధన కోసం కృషి చేయాలని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అధికారులకు సూచించారు. ఈ 10 న తిరుపతి నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం సందర్భంగా బడ్జెట్ ముసాయిదా పై నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్యతో కలసి మేయర్ అన్ని విభాగాల అధికారులతో మేయర్ డాక్టర్ శిరీష గురువారం సమావేశం నిర్వహించారు. నగర అభివృద్దే ధ్యేయంగా బడ్జెట్ రూపకల్పన చేయడం జరిగిందని కమిషనర్ ఎన్.మౌర్య, అధికారులను వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2026 = 2027 సంవత్సరానికి గాను బడ్జెట్ రూపకల్పనలో చేసే సందర్భంగా మనం ఒక్క విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని, కౌన్సిల్ సమావేశందే తుది నిర్ణయం అయినా అధికారులు చేసే బడ్జట్ రూపకల్పన కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకోవడానికి సులభతరం అవుతుందని తెలిపారు. అందుకే ప్రి బడ్జెట్ సమావేశానికి ప్రాదాన్యత ఉంటుందని తెలిపారు. 2025 – 26 ఆర్ధిక సంవత్సరానికి గాను ఆమోదించిన బడ్జెట్ అంచనాలు తగ్గట్లు ఆదాయం వచ్చిందా లేదా తెలపాలని అన్నారు. ముఖ్యంగా పన్నులు ప్రధాన ఆదాయమని, వాటి వసూళ్లలో చొరవ చూపాలని తెలిపారు. అదే సమయంలో ప్రజలపై భారం లేకుండా ఆదాయం వచ్చే అవకాశలని కల్పించాలని తెలిపారు. గత సంవత్సర బడ్జెట్ లోపాలను సరిచేసుకుంటూ నూతన బడ్జెట్ రూపొందించాలని తెలిపారు. గడిచిన ఆర్ధిక సంవత్సరంలో కౌన్సిల్ ఆమోదించిన ప్రాధాన్యత క్రమంలో నిధుల ఖర్చు చేశామా లేదా అన్నది సవివవరంగా కౌన్సిల్ ముందు ఉంచాలని తెలిపారు. మన నగరాన్ని అభివృద్ధి చేయాలంటే ఆర్ధిక వనరులు సమృద్ధిగా ఉంటే సాధ్యం అవుతుందని తెలిపారు. ఆదాయవనరులు సముకూర్చుకునేందుకు తగిన అవకాశలు కల్పించుకునెలా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. అవకాశం ఉన్న మేరకు ప్రజలపై భారం పడకుండా వనరుల సాధన కోసం ప్రత్యేక ప్రాదాన్యత ఇవ్వాలని తెలిపారు. ఇతర నగరాలకు లేని అవకాశం మన తిరుపతి నగరానికి ఉన్నదని, శ్రీవారి పాదాల చెంత మన నగరం ఉండడమేనని తెలిపారు. శ్రీవారి భక్తుల రాకపోకలు , టిటిడి సంస్థలు ఉన్న నగరం కాబట్టి టిటిడి సేవలను, అవకాశాలను గరిష్ట స్థాయిలో ఉపయోగించే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగరాల విస్తరణ, అభివృద్ధి పనుల కోసం ప్రవేశపెట్టే ప్రతి పథకాన్ని తిరుపతికి వర్తించే విధంగా మనం కృషిచేయాలి. గరిష్ఠ స్థాయిలో నిధులు సమకూర్చుకోవాలని తెలిపారు. స్థూలంగా మన బడ్జెట్ ప్రతిపాదనలో ప్రజల మీద అదనపు భారం పడకుండా ఆర్ధిక వనరులు పెంచుకోవడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయోజిత పథకాల నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకోవడం , టిటిడి సమన్వయం, సహకారంతో నిధులు మంజూరుకు ప్రత్యేక దృష్టి తో ఆలోచనలు చేయాలని సూచించారు. అంతిమంగా మన బడ్జెట్ ను చూసి తిరుపతి నగర ప్రజలు మేము నగరపాలక సంస్థకు చెల్లిస్తున్న ప్రతి రూపాయి సద్వినియోగం అవుతుందనే భవన కలిగేలా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో ఉప మేయర్ ఆర్.సి.మునికృష్ణ , అదనపు కమిషనర్ శారదా దేవి,ఉప కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, ఆరోగ్యాధికారి యువ అన్వేష్, డిసిపీ ఖాన్ , రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, మేనేజర్ హసిమ్, ఏసీపీలు, డిఈలు, తదితర అధికారులు పాల్గొన్నారు.



# చలో పోతిరెడ్డిపాడుకు కదిలిన వైఎస్సార్సీపీ శ్రేణులు రైతులు



**కొత్తపల్లి – నంది పత్రిక :** జూపాడుబంగ్లా మండలం పోతిరెడ్డి పాడు వద్ద వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త దార సుధీర్ ఆధ్వర్యంలో గురువారం చలోపోతిరెడ్డిపాడు కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్సీపీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున కదిలివెళ్లారు.మండలంలోని పాతమాడుగుల, ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లి, శివపురం, లింగాపురం, గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, జి.వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాలతోపాటు, కొత్తపల్లి మండల కేంద్రం నుంచి వైఎస్సార్సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో బైకులపై చలోపోతిరెడ్డిపాడుకు వెళ్లారు.

# రెండు తెలుగు రాష్ట్రాల సదస్సులో పీడియాట్రిక్ సర్జరీ పీజీ డా. ప్రియాంక కు లాంగ్ పేపర్ ప్రజెంటేషన్ లో ఫస్ట్ ర్యాంక్....

### అభినందనలు తెలిపిన అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్

### మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ...



**కర్నూలు నంది పత్రిక....**రెండు తెలుగు రాష్ట్రాల పీడియాట్రిక్ సర్జరీ వైద్యుల సదస్సులో కర్నూల్ మెడికల్ కాలేజీ పీడియాట్రిక్ సర్జరీ విభాగానికి చెందిన డాక్టర్ ప్రియాంకకు లాంగ్ పేపర్ ప్రజెంటేషన్లో మొదటి స్థానం సాధించడం పట్ల ఎడిఎంఈ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ పీడియాట్రిక్ సర్జరీ విభాగాన్ని ర్యాంకు సాధించిన డాక్టర్ ప్రియాంకను అభినందించడం జరిగింది.రెండు రాష్ట్రాల పిడిఎఫ్ సర్జరీ వైద్యుల సదస్సు ఇపీస్కాన్(×ూూజూచీ)–2026 ఈ నెల 1వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో కే.ఎం.సి. పీడియాట్రిక్ సర్జరీ పి.జి డాక్టర్ డాక్టర్ ప్రియాంక "థోరక్టమీ అండ్ డెకోరిటికేషన్ ఫర్ కాంప్లెక్స్ ఏపీమియా విత్ లంగ్ డామేజ్ ఇన్ చిల్డ్రన్" అన్న అంశంపై లాంగ్ పేపర్ ప్రజెంటేషన్ చేయగా తనకు మొదటి బహుమతి రావడం జరిగింది. ఈ సదస్సుకు రెండు రాష్ట్రాల నుంచి పీడియాట్రిక్ సర్జరీ వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం ప్రిన్సిపాల్ ను కలిసిన వారిలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరి చరణ్. పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ శివకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. గ్రేస్ మేరీ,డా. నరేష్, డా. మధు, డా. లోహిత్ రాజశేఖర్, పీజీలు డా. ప్రియాంక, డా.అఖిల్ ఇలాహి, డా. విజయ భార్గవి లు ఉన్నారు.

# ప్రయివేట్ ఆర్టీసీ బస్సు లను, మరియు భారీ లారీల ను, ట్రిప్పర్ లను వాటి స్పీడ్ ను నియంత్రించాలి

### రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్

### రాష్ట్ర అధ్యక్షులు బందెల ఓబులేసు



**కర్నూలు నంది పత్రిక.....**ప్రయివేట్ ఆర్టీసీ బస్సు లను, మరియు భారీ లారీల ను, ట్రిప్పర్ లను వాటి స్పీడ్ ను నియంత్రించాలనీ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోయిలకుంట్ల నుండి నంద్యాల కు వెళ్తున్న ప్రయివేట్ ఆర్టీసీ బస్సు ల డ్రైవర్ ల స్పీడ్ ను నియంత్రించాలి, అదే విధంగా వారి పైన ఒత్తిడి ని తగ్గించాలి.అని బందెల ఓబులేసు ఆర్టీసీ ఆర్ఎం మరియు ఆర్టీవో, అధికారులు ని డిమాండ్ చేశారు.అంతేకాకుండా, ఇటు కోయిలకుంట్ల నుండి నంద్యాలకు నంద్యాల నుండి కోయిలకుంట్ల తరచుగా కొన్ని వేల మంది ప్రయాణాలు చేస్తుంటారు.అందులో భాగంగా కోయిలకుంట్ల నుండి నంద్యాలకు హైవే రోడ్డు పనులు జరుగుతా ఉండగా రోడ్డు మరమ్మత్తులు భాగంగా దుమ్ముకు ధూళికి వెలువడిన గుంతలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఇలా ఉండగా ఆర్టీసీ ప్రైవేటు బస్సుల డ్రైవర్లు మరియు భారీ లోడ్ తో లారీలు మితిమీరిన స్పీడుతో పోవడంతో గుంతలున్న ప్రదేశంలో కలవర్టు నిర్మిస్తున్న ప్రదేశంలో దుమ్ము ఎక్కువ ఉండడంతో బైకుల మీద వెళ్లేవాళ్లు ట్రాక్టర్లు లో, ఆటలలో, కూలి పనులకు నిమిత్తం వెళ్లేవాళ్లు ఆ యొక్క దుమ్ముకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ముఖ్యంగా ఆర్టీసీ అధికారులు బస్సుల డ్రైవర్ల పైన సమయపాలన ఒత్తిడి కి గురి చేస్తూ ప్రయాణాన్ని కొనసాగించమని తక్కువ సమయానికి ఎక్కువ స్పీడుతో ప్రయాణం చేసే విధంగా జరుగుతుండడంతో చిన్నచిన్న ప్రమాదాలతో పాటు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందు ల కు,గురవుతున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్డు పనులు రోడ్డుకిరువైపులా పనులు జరుగుతుండడంతో భారీ భారీ వాహనాలు లారీలు అయితే, వీర విహారం చేస్తూ స్పీడ్ తో చక్కర్లు కొడుతూ అదేవిధంగా ఆర్టీసీ బస్సులు నిత్యం తిరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కాబట్టి సంబంధిత ఆర్టీవో అధికారులు చొరవ తీసుకొని అటు ఆర్టీసీ ఆర్టీసీ ఆర్ఎం అధికారులు బస్సులను భారీ లోడ్ తో వున్న లారీల ను, నెమ్మదిగా వెళ్లడానికి తగు సూచనలు ఇవ్వవలసినదిగా అనుమతి లేకుండా నడుపుతూన్న వాటి పైన చర్యలు తీసుకొని వాటిని గుర్తించి సీజ్ చేయాలనీ రాయలసీమ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బందెల ఓబులేసు డిమాండ్ చేశారు.అంతేకాకుండా కోయిలకుంట్ల నుండి నంద్యాల వరకు విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని పాఠశాల సమయానికి ాజ బస్సులు ను నడపవలసిందిగా అధికారులను డిమాండ్ చేశారు.ముఖ్యంగా మహిళలకు ఫ్రీ బస్సు నేపథ్యంలో పురుషులకు చిన్న పిల్లలకు వికలాంగులకు వృద్ధులకు మెరుగైన సౌకర్యం బస్సులలో కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ టౌన్ ప్రెసిడెంట్ అరదేశీ రమేష్, నాయకులు సమీర్, జాఫర్, జగన్, వలి, శ్యాం,సద్దాం సుమంత్, ప్రదీప్ లు పాల్గొన్నారు.

# ఉరుసు సందర్భంగా ముమ్మరంగా పారిశుధ్యం పనులు



**శిరివెళ్ల (నంది పత్రిక):** సిరివెళ్ల మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ గ్రామ పంచాయతీలో గల పాత శిరివెళ్ల ఏరియాలో ఉన్నటువంటి శ్రీ హజరత్ సయ్యద్ షానేశా ఉరుసు సందర్భంగా గ్రామపంచాయతీ తరపున ముమ్మరంగా పారిశుధ్యం పనులు నిర్వహించినట్లు డిప్యూటీ ఎంపీడీఓ శిరివెళ్ల మేజర్ పంచాయతీ ఈవో అశ్విన్ కుమార్ పేర్కొన్నారు. 5, 6, 7,తేదీలలో 3 రోజుల పాటు జరగనున్న ఉరుసు మహోత్సవాలను దృష్టిలో పెట్టుకొని వందలాదిగా భక్తులు పాల్గొంటారని అంటు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అక్కడ ఉన్న చెత్తాచెదారం పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాల పరిశుభ్రతకు కృషిచేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేసినట్లు తెలియజేశారు. 5న గంధం 6న ఉరుసు 7 జారతలు నిర్వహిస్తున్నందున తరలివచ్చే భక్తులు కళాకారులు బొమ్మల దుకాణం వ్యాపారులు ప్రతి ఒక్కరు దర్గా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓ అశ్విని కుమార్ సూచించారు.

# నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు రోజులుగా కాల్వ పై పడివున్న మృతదేహం.

### శానిటేషన్,సెక్యూరిటీ సిబ్బందికి కనిపించడం లేదా.



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 5 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకో సంఘటన చోటు చేసుకుంటుంది.ఆసుపత్రిలో వైద్యులు సరైన సమయానికి ఉండరు, ఓపీ లో గంటల కొద్ది నిలబడినా టికెట్ తీసుకున్న వైద్యులు ఉండరని ప్రజల ఆరోపణలు.ఆసుపత్రిలో ఏమి జరుగుతున్న ఆసుపత్రి కమిటీ కానీ ఎవరు పట్టించుకునే వారు కరువయ్యారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రెండురోజుల క్రితం నుంచి ఒక కాల్వ పై ఒక మృతదేహం పడిఉంది.ఆ వ్యక్తి వివరాలు తెలియవు కానీ మృతుని ఒంటిపై పత్రికల్లో రాయని చోట ఒక పైపు ఉన్నట్టు స్థానికులు చెపుతున్నారు.ఆసుపత్రిలోనే వైద్య సేవలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.అసలు విషయం ఏమంటే ఆసుపత్రిలో సెక్యూరిటీ,శానిటేషన్ సిబ్బంది రెండు రోజులుగా అసలు విధులు నిర్వహిస్తున్నారా లేదా అన్నది అర్థం కావడం లేదు.జీతాలు ఫుల్ సేవలు నిల్ అనే చందంగా మారింది.మరో విషయం ఏమంటే అక్కడ ఏమి జరుగుతున్నా ఔట్ పోస్ట్ పోలీసులకు తెలుస్తుంది.ఈ విషయం వారికి తెలియకపోవడం విశేషం. ఎందుకు అంటే ఆసుపత్రి లో ఏ చిన్న సంఘటన జరిగినా ఔట్ పోస్ట్ లో ఉండే వారి ఆసుపత్రికి వెళ్ళి విచారణ చేస్తారు.అక్కడ రెండు రోజులుగా పడివున్న మృతదేహాన్ని గుర్తించకపోవడం విశేషం.నిర్లక్షం వహిస్తున్న సెక్యూరిటీ,శానిటేషన్ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటే మరోసారి ఇలాంటి సంఘటనలు చేసుకోవు.

# పెండింగ్లో ఉన్న ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేయాలి....

### ప్రభుత్వాన్ని కోరిన ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్

### గిరిజన నిరుపేదలకు మెరుగైన వైద్యవందక అవస్థలు...



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 5 ( నంది పత్రిక )** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఆరోగ్యశ్రీ నిధులను వెంటనే విడుదల చేయాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా నంద్యాలలో జిపిఎస్ కార్యాలయంలో ముఖ్య నేతల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పేదలు, గిరిజనులు బలహీన వర్గాల ప్రజలు అత్యవసర వైద్య సేవల కోసం ప్రధానంగా ఆధారపడే ఆరోగ్యశ్రీ పథకం నిధులు నిలిచిపోవడంతో అనేక ఆసుపత్రులు చికిత్స అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన తెలిపారు. బడ్జెట్లు విడుదల కాకపోవడం వల్ల రోగులు సమయానికి చికిత్స పొందలేక ప్రాణాపాయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలిపారు ప్రత్యేకంగా గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు ఇప్పటికే పరిమితంగా ఉన్న నేపథ్యంలో ఆరోగ్యశ్రీ నిధులు ఆలస్యం మరింత భారంగా మారిందన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ప్రైవేట్ మరియు కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ కేసులను స్వీకరించడానికి వెనుక వేస్తున్నాయని చెప్పారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని ఆరోగ్యశ్రీ పెండింగ్ బడ్జెట్ను వెంటనే విడుదల చేయాలని ఆసుపత్రుల బిల్లులను విడుదల చేయాలన్నారు. పేద ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. పేద ప్రజల ఆరోగ్యం . రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పెండిం గ్లో ఉన్న రూ.3600 కోట్లు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆసుపత్రులకు జిల్లాలో రూ.120 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు ఉన్నాయని, విడుదల చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు.

# చెట్ల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత.

### ప్రజల నిర్లక్ష్యంతో ప్రకృతి సమస్యలు.

### మొక్కలు నాటి...పర్యావరణాన్ని కాపాడుకుందాం.






**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 5 ( నంది పత్రిక )** చెట్ల పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలి,ప్రజల నిర్లక్ష్యంతో ప్రకృతి సమస్యలు ఎదురవుతున్నాయని,ప్రతిఒక్కరు మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుకోవాలని సీనియర్ సైంటిస్ట్, ఎంట మాలజిస్ట్ మంజునాథ్ సూచించారు.

**ఈకోఫెస్ట్లో భాగంగా "వాయిస్ ఆఫ్ నేచర్" కార్యక్రమం** శ్రీ శాంతినికేతన్ సీబీఎస్ఈ పాఠశాలలో నిర్వహించారు. 5వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా ఈకోఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా "వాయిస్ ఆఫ్ నేచర్" పేరుతో పర్యావరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ప్రకృతి పరిరక్షణ ప్రతిజ్ఞతో ప్రారంభమై, విద్యార్థుల్లో బాధ్యతాభావాన్ని కలిగించింది.ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సైంటిస్ట్ & ఎంటమాలజిస్ట్ శ్రీ మంజునాథ్ గారు చెట్ల సంరక్షణ అవసరం , మనుషుల నిర్లక్ష్యం వల్ల ప్రకృతి ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి విద్యార్థులను చైతన్యపరిచారు. అలాగే చైర్మన్ సుధాకర్ మనుషుల కార్యకలాపాల ప్రభావం, ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, వాటిని నివారించే ఆచరణాత్మక మార్గాలను వివరించారు. విద్యార్థులు పర్యావరణ నాటికలు, సాంస్కృతిక నృత్యాలు, ప్రకృతి గీతాలు, ప్రకృతి రూపాల ఫ్యాన్సీ డ్రెస్సులు మరియు ఆశ్చర్యకరమైన ప్రకృతి విషయాల ప్రదర్శనలు ద్వారా అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం చిన్నారుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, అవగాహన మరియు సంరక్షణ భావనను పెంపొందించింది.చివరగా, "ఈ రోజు ప్రకృతిని కాపాడితేనే రేపటి భవిష్యత్తు సురక్షితం" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



# యూట్యూబ్ లో కొత్త ఫీచర్ గమనించారా...

గూగుల్ యాజమాన్యంలోని ప్రముఖ వీడియో ప్లాట్ఫామ్ యూట్యూబ్, తన ఏఐ (ూ×) ఆధారిత ఆటో–డబ్బింగ్ ఫీచర్ను యూజర్లందరికీ అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు పరిమితంగా ఉన్న ఈ సౌకర్యం, ఇప్పుడు అన్ని ఛానెళ్లకు విస్తరించింది. దీని ద్వారా వీడియోలను 27 భాషల్లోకి ఆటోమేటిక్గా డబ్ చేసి చూడవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంటెంట్ను భాషా అడ్డంకులు లేకుండా వీక్షించడానికి ఇది వీలు కల్పిస్తుంది. 2023లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ ఫీచర్ను, 2024లో నాలెడ్జ్, ఇన్ఫర్మేషన్ వీడియోలకు విస్తరించారు.

# కార్మిక వర్గం పోరాడకుండా హక్కులు సాదించుకోలేము

## -రాబోయే కాలంలో పోరాటాలు ఉధృతం




**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 05 . (నంది పత్రిక ):**ఏప్రిల్ 17,18,19 తేదీలలో నంద్యాల జిల్లా కేంద్రంలో జరగనున్న సీఐటీయూ రాష్ట్ర 17 వ మహాసభ ల సన్నాహక ఆహ్వాన సంఘం ఏర్పాటైంది. గురువారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కాలేజీ లోని వివేకానంద ఆడిటోరియాంలో జరిగిన కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి. ఏసురత్నం అధ్యక్షత వహించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు గా కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎం ఏ గఫూర్, గౌరవాధ్యక్షులుగా శాంతిరాముడు, ప్రధాన కార్యదర్శిగా ఏ నాగరాజు కోశాధికారిగా వి యేసురత్నం చీఫ్ పాట్రన్స్ గా గురురాజా విద్యాసంస్థల అధినేత డాక్టర్ దస్తగిరి రెడ్డి , ప్రముఖ వ్యాపారవేత్త మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రామకృష్ణ విద్యాసం స్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి , నేషనల్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్. ఇంతియాజ్ అహ్మద్ , వందమంది ప్యాట్రన్స్ లను, గౌరవ సభ్యుల పేర్లు లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి హెచ్ నరసింగరావు ముఖ్యతిధిగా హాజరై మాట్లాడారు. ఏప్రిల్ 17,18,19 తేదీలలో రాష్ట్ర మహాసభల్లో పలు కీలకమైన అంశాలపైన చర్చలు జరిపి పలు తీర్మాణాలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 17 వ తేదీన నంద్యాల పట్టణంలో జరుగు కార్మిక ప్రదర్శన, బహిరంగ సభలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల రక్షణకు, కార్మిక పోరాటాలు ఉధృతం చేయడానికి ఈ మహాసభల్లో కార్యాచరణ రూపొందించ బోతున్నట్లు తెలిపారు.కేంద్రంలో అధికారంలోకి నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం దుర్మార్గమైన కార్మిక, ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. ఫిక్స్డ టర్మ్ ఎంప్లాయి మెంట్ పేరుతో ఉద్యోగులకు, కార్మిక వర్గానికి,పాలకులు ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. లేబర్ కోడ్ లను తెచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేయబోతున్నారని కేంద్ర ప్రభుత్వం పై మండిపడ్డారు. కార్మిక వర్గం ఉత్పత్తి చేయకపోతే దేశంలో జి డి పి పెరుగదన్నారు. అలాంటి కార్మికులను నేడు పాలకులు కార్పొరేట్, పెట్టుబడి దారులకు బానిసలుగా మార్చబోతు వారి శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు. కనీస వేతనాలు లేక చాలి చాలని జీతాలతో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ బతుకులీడుస్తున్నారని ఆరోపించారు.కార్మిక వర్గం పోరాడకుండా హక్కులు సాదించుకోలేము.కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగుల హక్కులను కాలరాస్తుందని. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను మోడీ హరించి వేస్తూ బానిసలుగా మారుస్తున్న మోడీ చట్టలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సమ్మె చేసే హక్కులేదని పోరాడి సాధించుకున్న 8 గంటల పనిని పెంచారని,లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మికుల, ఉద్యోగుల నడ్డి విరుస్తున్నారన్నారు.నంద్యాలలో జరుగ బోయే మహాసభలు ప్రభుత్వాలు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు చేయాలంటే భయపడేలా జరుపాలని పిలుపునిచ్చారు.కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్ లను కేరళలో ఎల్ డి ఎఫ్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు.కేరళలో ప్రతి కార్మిక రంగానికి ఒక కార్పొరేషన్ ను ఏర్పాటు చేశారని ప్రతి ఒక్కరికి వెల్ఫేర్ బోర్డులు ఉన్నాయని తెలిపారు. కార్మిక రాజ్యం కోసం సీఐటీయూ పని చేస్తుందన్నారు.కార్మిక రాజ్యం ఉన్న చోట కార్మిక హక్కులు రక్షించబడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.లిలిరాష్టంలో దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని కార్మికులను, కష్ట జీవులతో కారు చౌకగా పని చేయిస్తూ పెట్టుబడి దారులకు, కార్పొరేట్ శక్తులకు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారని సి. హెచ్. నరసింగరావు విమర్శించారు. దేశంలో సంపద సృష్టించే కార్మిక వర్గం పై పాలక వర్గాలు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కార్మిక హక్కుల కోసం లేబర్ కోడ్ ల రద్దు కై ఈ నెల 12 న జరుగు దేశ వ్యాప్తంగా సర్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని అయన కార్మిక వర్గాన్ని కోరారు.రాయలసీమ ప్రాంతాల్లో ఖనిజ సంపద బాగా ఉందని, న్యూక్లియర్ కు అవసరమైన వనరులు, సంపద ఆంధ్రప్రదేశ్ లో ఉందని అయితే ఈ సంపదనంత కార్పొరేట్ సంస్థలకు దారదాత్తం చేస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వం రంగంలో నడుస్తున్న ఐ డి పి ఎల్ వంటి ఫార్మ సంస్థలను ప్రయివేట్ కంపెనీలకు అప్పగించి ప్రభుత్వాలు వ్యాపారం చేస్తున్నాయన్నారు.వేల ఎకరాలు శ్రీరిడి సాయి, సోలార్, లూలో, రిలయన్స్,ఆధాని, అంబాని వంటి ప్రయివేట్ కంపెనీలకు ఆప్పణంగా భూములను ఇస్తున్నారన్నారు. విద్యుత్ రంగాన్ని టాటా కంపెనీకి అప్పగిస్తున్నారు. దీనిపైన విద్యుత్ కార్మికులు పోరాటాలు చేస్తున్నారు.అనంతరం శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కే. ధనలక్ష్మి మాట్లాడుతూ లేబర్ కోడ్ ల పేరుతో కార్మిక చట్టాలను మార్చి యజమానులను రక్షిస్తూ, కార్మికులను శిక్షించే విధంగా చేస్తున్నారని విమర్శించారు. పనిగంటలు, వేతన హక్కులను నిర్వీర్యం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు రాత్రి షిఫ్టులో పని చేయాలని చెప్పడం చూస్తుంటే మహిళా ఉద్యోగులకు, మహిళా కార్మికులకు రక్షణ ఉంటుందా అనే సందేహం వ్యక్తమౌతుందన్నారు. రాష్టంలో మహిళల పట్ల

జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయని వాటిని నివారించలేని ప్రభుత్వం రాత్రి పూట మహిళలు పని చేయాలని నిర్ణయించడం మహిళల పట్ల చంద్రబాబుకు ఉన్న చిత్త శుద్ధి తేటతెల్ల మౌతుందన్నారు.అనంతరం సిఐటియు రాష్ట్ర మహాసభల లోగోను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింహ రావు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కే ధనలక్ష్మివిడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి రమేష్ కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ రాజశేఖర్ టి రామచంద్రుడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం నాగేశ్వరరావు నరసింహ నాయక్ లతోపాటు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే మహమ్మద్ గౌస్ వై ఎల్లయ్య జి సేబారాణి జిల్లా కార్యదర్శి డి లక్ష్మణ్ పి వెంకట లింగం వెన్న బాల వెంకట్ తిరుపతయ్య రమణకుమారి నాగమణి లతోపాటు 300 మందికి పైగా సిఐటియు కార్యకర్తలు ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొనడం జరిగిందిలి

# పనులు కల్పించడంలో అధికారులు విఫలం కాకూడదు.

**-సామాజిక తనిఖీ ప్రజావేధికలో అధికారులకు ప్రాజెక్ట్ డైరెక్టర్ సూచన**

**-అవకతవకలకు చెందిన నగదును త్వరగా ధీకరవరి చేయండీ**

**-డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యనారాయణ**




**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించడంలో అధికారులు విఫలం కాకూడదని నంద్యాల డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యనారాయణ సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీడీఓ మేరి అధ్యక్షతన జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం, అనుబంద సంస్థలలో జరిగిన పనులపై 18 వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ పనులు చేసి ఫోటోస్ సమర్పించకపోవడంవల్ల ఏపని ఎప్పుడు, ఎక్కడా చేశామని తనిఖీ వారు గుర్తించలేకపోయారన్నారు. రికార్డుల నిర్వహణ పనితీరుపై మండిపడ్డారు. హర్టికల్చర్పై రైతులకు అవగాహన ఎవ్వరు కల్పించినట్లు ఆనిపించలేదన్నారు. తప్పులు మరళ పునావృతం కాకుండా చూసుకోవాలన్నారు. 2024-25 సంవత్సరంలో జరిగిన 161 పనులపై సామాజిక తనికీ చేశారన్నారు. ఈ పనులకు గాను రూ.3.90 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఇందులో ఎన్ఆర్జీఎస్ శాఖలో రూ.7.40 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖలోని వాటిని 2.48 కోట్లు, ఎస్.ఎస్.ఏకు సంబందించి పనులకు రూ. 13500, ఐటీడీఏ శాఖలో పడపనులకు రూ.1.49 లక్షలు ఖర్చు జరిగిందన్నారు. ఇందులో సామాజిక తనిఖీ వారు 1.78 కోట్లు అవకతవకలు జరిగినట్లు గుర్తించారన్నారు. ఇందులో రూ.55460 రీకవరి, రూ.49500 పెనాల్టీకి ఆదేశించామన్నారు. అదేవిధంగా హర్టికల్చర్ క్రింద రైతుల పొలాల్లో మొక్కలు లేనందున మొక్కలు లేనిచోట రీ ప్లాంటేషన్ చేయకపోతే రైతుల నుంచి రీప్లాంటేషన్కు రూ.96796 దీకవరి చేయాలని ఆదేశించారు. మిగిలినవాటిపై విచారణ జరిపించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటరామిరెడ్డి, అడిషనల్ విజిలెన్స్ అధికారి పరమేశ్వరుడు, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ చంద్రమోహన్, ఏపీఓ విమలమ్మ, పీఆర్ ఈ మద్దిలేటీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్ యస్ ఓ.యఫ్ లో 3 గోల్డ్ మెడల్స్, సాధించిన శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థులు-:



**పాములపాడు ఫిబ్రవరి 5 (నంది పత్రిక) -:** సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్ 2025-26 పరీక్షల్లో శ్రీ వివేకానంద విద్యా విహార్ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి 3 గోల్డ్ మెడల్స్ సాధించారు. అలాగే జోనల్ స్థాయిలో మరో ఏడు మంది విద్యార్థులు డిస్టింక్షన్ లెవెల్ టూ కి ఎంపికయ్యారు.72 దేశాల్లో 96,466 పాఠశాల ల్లో సైన్స్ ఒలంపియాడ్ ఫెడరేషన్ నిర్వహించిన ఈ పోటీలో లెవెన్ వన్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు లెవెల్ 2 2025-26 కు అర్హత సాధించారు. ఈ నెల 8వ తారీఖున కర్నూల్ లోని మాంటిసోరి ఏ క్యాంపు హైస్కూల్లో యస్ ఓ యఫ్ ఎగ్జామినేషన్ సెంటర్ లో జాతీయస్థాయి పరీక్షల్లో పాల్గొనడానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా 4వ, 6వ, 7వ, 9వ తరగతుల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో ఎంపికై పాఠశాలకు గర్వకారణమయ్యారు అలాగే అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్ తో పాటు.. నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ వంటి ఇతర ఒలింపియాడ్ పరీక్షల్లో కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం విశేషం.

**ఈ విజయాన్ని సాధించిన విద్యార్థుల్లో**4వ తరగతి ఎం. ధోయా జాక్షి జూటూరు 6వ తరగతి , జి. వెంకట ఫణీంద్ర, తూడిచర్ల. వి. సింధు కృష్ణా నగర్, పి. వైష్ణవి తూడిచర్ల. జి.తమన్ బన్నూర్ బి. నాగేంద్రుడు పాములపాడు. 9వ తరగతి కె. కావ్య చెలిమిళ్ల గ్రామాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు అంతర్జాతీయసైన్స్ ఒలంపియాడ్ లో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు. దీ.నాగేంద్రుడు. 6 వ తరగతి,.వి.సింధు 6 వ తరగతి.4 వ తరగతి యం.తోయ జాక్షి వ్యక్తిగత గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని కరస్పాండెంట్ ఆర్ యస్ ఆర్ గోపాల్ ఆకాంక్షించారు. విద్యార్థుల విజయంలో తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల మార్గదర్శనం కీలక పాత్ర పోషించిందని తెలిపారు.

# రాయలసీమ లిఫ్ట్ కోసం నిర్వహించిన సభ విజయవంతం





## మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గారు

**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 5 ( నంది పత్రిక )** రైతులకు, ప్రజలకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా, రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధన కొరకు నిర్వహించిన చలో పోతి రెడ్డి పాడు లో భాగంగా,నంద్యాల జిల్లా, నందికొట్కూరు నియోజకవర్గం, “పోతిరెడ్డి పాడు“ గ్రామం వద్ద ,కాటసాని రాం భూపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమం లో వైఎస్ ఆర్ సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి గారు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డి గారు, నంద్యాల జిల్లా పరిశీలకురాలు ఎమ్మెల్సీ కల్ప లతా రెడ్డి గారు, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి గారు, మాజీమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గారు, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి గారు, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణి రెడ్డి గారు, ఎమ్మెల్సీ ఇషాక్ భాషా గారు, కాటసాని రామిరెడ్డి గారు, గంగుల విజయేంద్ర నాథ్ రెడ్డి గారు నందికొట్కూరు వైసిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి గారు నందికొట్కూరు ఇంచార్జ్ దారా సుధీర్ రెడ్డి గారు, రాష్ట్ర మార్క్ షెడ్ చైర్మన్ పి పి నాగిరెడ్డి గారు నెల్లూరు మరియు రాయలసీమ జిల్లాల శాసన సభ్యులు,మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రులు, మాజీ శాసన సభ్యులు, మరియు ,రైతు సంఘాల నాయకులు, వై ఎస్ ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్న మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గారు ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ కుటుమి ప్రభుత్వం మెడలు వంచి రాయల సీమ లిఫ్ట్ ఇరిగేన్ పనులు పూర్తి చేసి రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లా రైతులకు, ప్రజలకు అందజేస్తామని రైతుల సాగు నీటి కోసం, ప్రజల త్రాగు నీటి కోసం రాజీ లేని పోరాటం చేస్తామన్నారు – సూర్యుడు తూర్పున ఉదయించి, పడమర అస్తమించడం ఎంత వాస్తవమో, ఈ రాష్ట్రం లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చి, జగన్ మోహన్ రెడ్డి గారు తిరిగి ముఖ్య మంత్రి కావడం ఖాయం – చలోపోతిరెడ్డి పాడు కార్యక్రమంకి భారీగా తరలివచ్చి, విజయవంతం చేసిన రైతులు, రైతు సంఘాల నాయకులు,వై ఎస్ ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు






## స్లాట్ బుకింగ్ కొరకు దరఖాస్తులు చేసుకోండి.



**బేతంచెర్ల ఫిబ్రవరి 5 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలం లోని మరియు గ్రామీణ ప్రాంతాలలోని దివ్యాంగులు స్లాట్ బుకింగ్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పీట్ల మద్దిలేటి, కార్యదర్శి బి. రాముడు తెలిపారు.స్థానిక కార్యాలయం నందు గురువారం ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఈ నెల ఫిబ్రవరి 15 వ తేదిన స్లాట్ బుకింగ్ కు అర్హులు దీర్గ కాలిక వ్యాధి, శారీరక అవయవాలు కోల్పోయిన వారు తాత్కాలిక ధ్రువీకరణ పత్రం పొందిన వారు వీటికీ ఆన్ లైన్ బుకింగ్ చేసుకొన వలయునని కోరుతున్నాము.కేవలం 2 రోజులు మాత్రమే అవకాశం ఎంచు కున్న ఆస్పత్రులలో స్కీనింగ్ నిర్వహిస్తారు.కావున ఎవరైనా దివ్యాంగులు అర్హులైన వారు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో రామ మోహన్, శకుంతల, సురేష్,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# డోన్ ఎంఎల్ఏ కోట్లను సన్మానించిన బేతంచెర్ల నగర పంచాయితి కమీషనర్ & సిబ్బంది.

**బేతంచెర్ల ఫిబ్రవరి 5 ( నంది పత్రిక ).** డోన్ శాసనసభ్యులు, మాజీ కేంద్ర మంత్రి కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డిని బేతంచెర్ల నగర పంచాయితి కమిషనర్ డి. హరిప్రసాద్, బేతంచెర్ల నగర పంచాయతీ తరుపున శాలువా మరియు పుష్ప గుచ్ఛంతో గురువారం నాడు సన్మానించడం జరిగింది. అందుకు కారణం ఏమంటే, 77 వ గణ తంత్ర దినోత్సవ సందర్భంగా నంద్యాల జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ రాజకుమారి గణియా చేతుల మీదుగా బేతంచెర్ల నగర పంచాయతి కమీషనర్ డి. హరిప్రసాద్ కు ఉత్తమ సేవ అవార్డు రావడం జరిగింది. మరియు గౌరవ కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటర్ చేతుల మీదుగా అనంతపురం రీజన్ 42 యు.ఎల్.బి లకు గాను,ఆర్యభట్ట ఆడిటోరియం మూడవ అంతస్తు నందు, శానిటేషన్ పనులు, వీధిదీపాలు, వాటర్ సప్లై, మరియు టాక్స్ కలెక్షన్ ను మెరుగు పరచినందులకు, బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ కు,ఉత్తమ సేవా అవార్డు రావడం జరిగింది. అందులకు కారణం డోన్ శాసనసభ్యులు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి వారి విలువైన ప్రోత్సాహం బేతంచెర్ల నగర పంచాయతీకి అందించి నందు వలన,మాకు ఈ పరిష్కారం లభించింది. ఇంకా మీరు భవిష్యత్తులో కూడా మీ మార్గ దర్శకత్వం మరియు సహకారం అందించాలని మనవి చేస్తూ బేతంచెర్ల నగర పంచాయతీ సిబ్బంది మరియు కమిషనర్ డోన్ ఎంఎల్ఎ ను సత్కరించడమైనది.



## నిరక్షరాస్యులను.. అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి.

**మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి.**

**నందికొట్కూరు ఫిబ్రవరి 5(నంది పత్రిక )** వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యు లుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని నిరక్షరాస్యులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని హాజీ నగర్ ఉర్దూ స్కూల్ నందు ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమం లో వాలంటీర్స్ కు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనులైన నిరక్షరాస్యుల ను గుర్తించి ప్రతిరోజు సాయంత్రం పూట ఒక గంట పాటు వారికి అక్షరజ్ఞానం నేర్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎంఎం ప్రమీలమ్మ, సి ఓ అర్చన, జయంతి, సచివాలయ సిబ్బంది వాలంటీర్స్ పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి గారి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత



**పోలీసులు అప్రమత్తంగా ఉండాలి.**
**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్**
**అందరూ సమన్వయంతో పని చేయాలి.**
**ట్రాఫిక్ నియంత్రణ , రూట్ బందోబస్తు అత్యంత కీలకం.**
**ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.**

కర్నూలు నంది పత్రిక......ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఎమ్మిగనూరు మండలం , కలుగొట్ల గ్రామంలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో కలుగొట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి బహిరంగ సభ దగ్గర కు బందోబస్తు నిమిత్తం విచ్చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందికి కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ పలు సూచనలు, సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు.సిఎం పర్యటనలో క్షేత్రస్థాయి అధికారుల నుండి క్రింది స్థాయి సిబ్బంది వరకు సెక్టార్ల వారీగా అప్రమత్తంగా ఉండాలన్నారు. కేటాయించిన విధులలో భాద్యతయుతంగా ఉండాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి పర్యటించే రూట్ & రూఫ్ – టాప్ ప్రాంతాలలో, సిఎం కాన్వాయ్, హెలిప్యాడ్, సభ ప్రాంగణం తదితర ప్రాంతాలలో బందోబస్తు విధులు నిర్వహించే మఫ్టీ పోలీసులు స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు , పోలీసు జాగీలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలాంటి సంఘటనలు జరగకుండా భద్రత పరంగా పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ట్రాఫిక్ నియంత్రణ , రూట్ బందోబస్తు



అత్యంతకీలకమన్నారు.ముఖ్యమంత్రి పర్యటించే మార్గాల్లో సిబ్బంది పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. చేయకూడనవి, చేయవలసిన వాటి గురించి తెలిపారు. అనంతరం కర్నూలు ఎస్పీ హెలిప్యాడ్ నుండి సభా ప్రాంగణం వరకు సీఎం కాన్వాయ్ రిహార్సల్స్ ట్రయల్ రన్ ను పరిశీలించారు.కాన్వాయ్ రిహార్సల్స్ ట్రయల్ రన్ లో భద్రతా పరమైన అంశాలను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు యుగంధర్ బాబు, కృష్ణమోహన్ , కర్నూలు, కడప, నంద్యాల, అన్నమయ్య జిల్లాల డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చెన్నూరులో దోమల బెడద నివారణకు ఊరంతా ఫాగింగ్ :



శిరివెళ్ల (నంది పత్రిక) :-సిరివెళ్ల మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఊరంతా ఫాగింగ్ మిషన్ తో దోమల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకున్నట్లు గ్రామపంచాయతీ సెక్రటరీ రఘు మరియు సర్పంచ్ బుచ్చిబాబు,మెరువ నాగభూషణం రెడ్డి పేర్కొన్నారు. గ్రామ సమీపంలో పంట పొలాలు వాగులు కాలువలలో తెలుగు గంగ నీరు ఉండడం వల్ల చెన్నూరు గ్రామంలో దోమలు ఉధృతి అధికంగా ఉన్నదని గ్రామస్తులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సర్పంచ్ మరియు నాగభూషణం రెడ్డి గ్రామపంచాయతీ అధికారుల సమక్షంలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలియజేశారు. పెరుగుతున్న దోమల ఉధృతిని తగ్గించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.చెన్నూరు గ్రామంలో జరుగుతున్న ఫాగింగ్ పనులను స్వయంగా పాల్గొని పర్యవేక్షించారు. గ్రామంలోని ప్రతి వీధిలో ప్రతి మురుగు నీటి కాలువల వద్ద ఫాగింగ్ చేపించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ శానిటేషన్ పనులలో బాగంగా తీసుకున్న ఫాగింగ్ చర్య పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# నగరాభివృద్ధికి సహకరించాలి

**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**340-సి రహదారిలో ఆస్తి కోల్పోయే యజమానులతో సమావేశం**




కర్నూలు నంది పత్రిక...... నగర పరిధిలో శ్రీ దామోదరం సంజీవయ్య కూడలి నుండి కెవిఆర్ గార్డెన్స్ వరకు చేపట్టనున్న 340-సి రహదారి విస్తరణలో ప్రభావితమయ్యే ఆస్తి యజమానులు నగరాభివృద్ధికి స్వచ్ఛందంగా సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. గురువారం చెక్‌పోస్ట్ సమీపంలోని సంతోషి ఫంక్షన్ హాల్లో ఎన్‌హెచ్-340 రహదారిలో ప్రభావిత ఆస్తి యజమానులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగర భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారి విస్తరణ అత్యంత కీలకమని, పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎవరూ నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఆస్తులు కోల్పోతున్న వారికి టిడిఆర్ బాండ్ల రూపంలో, భవనాలకు నగదు రూపంలో తగిన పరిహారం అందజేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కొందరికి టిడిఆర్ బాండ్లు అందజేసినట్లు పేర్కొంటూ, మిగిలిన వారికి కూడా త్వరలో అందించనున్నట్లు వెల్లడించారు. మెరుగైన రవాణా సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, సమగ్ర నగరాభివృద్ధి కోసం ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రభావితుల్లో ఇప్పటికే ఏడుగురికి టిడిఆర్ బాండ్లు అందజేసినట్లు తెలిపారు. మరో 20 మందికి పంపిణీ చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. పత్రాలన్ని సమర్పించి ప్రభావితులందరూ ఒకేసారి సహకరిస్తే పరిహారం పంపిణీ త్వరగా పూర్తి చేసి, రహదారి విస్తరణ పనులను వేగంగా ప్రారంభించవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో డిసిపి వెంకట రమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు అభినయ్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశావ్యాపిత సమ్మెను జయప్రదం చేయండి.

కర్నూలు నంది పత్రిక..... ఈనెల 12వతేది జరుగు దేశావ్యాపితే సమ్మెను జయప్రదం చేయాలని సి. ఐ.టి.యు.జిల్లా కార్యదర్శి ఎం.డి. అంజిబాబు ఎ. ఐ.టి.యు. సి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మునెప్ప కార్మికులకు పిలుపు నిచ్చారు.సి. ఐ.టి. యు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ ,ఏ,ఐ.టి.యు.సి. నగర కార్యదర్శి అధ్యక్షతన స్థానిక ఏం.పి.పి.హాల్ నందు జిల్లా సదస్సు జరిగింది. ఈసదస్సు లొవారు మాట్ల డుతూ కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు .నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 29 రకాల కార్మిక చట్టాలను మార్పులు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లు తీసుకురావడం జరిగిందని అన్నారు. సంఘం పెట్టుకునే హక్కు, భేరసారాలు ఆడే హక్కు, సమ్మె చేసే హక్కు అన్నీ కూడా కోల్పోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు లేబర్ కోడ్స్ వల్ల చాలా ఇబ్బందులు గురికావాల్సి వస్తుందని అన్నారు. ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీయా కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తేదీన జరిగే సమ్మె జయప్రదం చేయడం కోసం కృషి చేస్తామనితెలియజేశారు .బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామరాజు మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ లో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఎస్ఎన్ఎల్ లో ఉద్యోగులందరూ సమ్మెకు జయప్రదం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు ఎ .పి.రైతు సంగం జిల్లా కార్యదర్శి సంపన్న గౌడు ,రైతు సంఘాలుగా రైతులందరిని సమీకరిస్తామని తెలిపారు .ఈ సదస్సులో ఎస్. యు సి ఐ జిల్లా కార్యదర్శి నాగన్న, రైతు సంఘం జిల్లా రాష్ట్ర నాయకులు జగన్నాథం వ్యవసాయ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రాయుడు,జనరల్ ఇన్సూరెన్స్ నాయకులుజంద్యాల.రఘుబాబు, సిఐటియు ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మనోహర్ మాణిక్యం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు ఏఐటియుసి జిల్లా నాయకులు లెనిన్ బాబు




ఏఐటీయూసీ నగర అధ్యక్షులు బి వెంకటేష్ డిప్యూటీకాదర్శి రామాంజనేయులు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ కృష్ణారెడ్డి బాబూలాలు మహిళా సమైక్య కార్యదర్శి శ్రావణి పావని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు జిల్లా నాయకులు గోపాల్, సిఐటియు నగర కార్యదర్శి నరసింహ ,నగర అధ్యక్షులు నగేష్ ,నాయకులు మహమ్మద్ రఫీ , సిఐటియు ఓల్డ్ సిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి.మద్దిలేటి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు మల్లన్నతదితరులు పాల్గొన్నారు.

# 115 ఏళ్ల వృద్ధురాలు మృతి



కొత్తపల్లి – నంది పత్రిక : ప్రస్తుత కాలంలో ఎవ్వరైనా 60 నుంచి 70 ఏళ్లు బ్రతుకుతారు. ఎంతో ఆరోగ్యంగా ఉంటే చివరిగా 80 సంవత్సరాలు బ్రతుకుతారు. ఇలాంటి పరిస్థితుల్లో 115 ఏళ్లు బ్రతికిన వృద్ధురాలు మృతిచెందింది. వివరాల్లోకి వెలితే మండలంలోని ఎం.లింగాపురం గ్రామంలో చిమ్మె రత్నమ్మ జీవనం సాగిస్తుండేది. ఈమె 1911 సంవత్సరంలో జన్మించింది. నేటివరకు 100 ఏళ్లు పైబడిన ఎంతో ఆరోగ్యంగా ఉండేది. వయస్సు పై బడడంతో గురువారం ఆమె స్వగ్రామంలో మృతిచెందినట్లు బంధువులు పేర్కొన్నారు. ఇన్నీ ఏళ్లు చిమ్మె రత్నమ్మ బ్రతకడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కూటమి ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధితో కూడిన పాలన సాగుతోంది.

**వైసిపి నాయకులు చేసే డైవర్షన్ పాలిటిక్స్ ను ప్రజలు నమ్మరు.**
**వైసీపీ హయాంలో ఋణ లడ్డు ప్రసాదం కల్తీ జరిగింది.**
**అంబటి రాంబాబుని కాపులు నమ్మే పరిస్థితిలో లేరు.**
**వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసే జిమ్మిక్కులు అన్ని ప్రజలు గమనిస్తున్నారు.**
**జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు**

కర్నూలు నంది పత్రిక...... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్షేమం అభివృద్ధితో కూడిన పాలన సజావుగా సాగుతుందని గత వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో జరిగిన అనేక అవకతవకలు ఘోరాలు వెలుగులోకి వస్తున్న తరుణంలో వైసీపీ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ కి తెర లేపారని జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు అన్నారు. ఈ మేరకు గురువారం కర్నూలు నగరం బిర్లా కాంపౌండ్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ తిరుమల తిరుపతి లడ్డులు కల్తీ జరిగిందని అందులో నెయ్యే లేదని కొన్ని రసాయనాలు వాడి నెయ్యి లాగా తయారుచేసి సరఫరా చేసిందని ఖచ్చితమైన రిపోర్టు ఇవ్వడం జరిగిందని తెలిపారు. దీన్ని వక్రీకరిస్తూ వైసీపీ నాయకులు సిబిఐ మాకు క్లీన్ చీట్ ఇచ్చిందని ప్రజలని తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు.కాపు నేత అంబటి రాంబాబు పై కూటమి ప్రభుత్వం దాడి చేసిందని కాపులను రెచ్చగొట్టే విధంగా కొత్త నాటకానికి వైసీపీ నాయకులు తెర లేపారని కాపులు అంబటి రాంబాబుని ఎప్పటికీ నమ్మరని గుర్తుంచుకోవాలని అన్నారు. అంబటి రాంబాబు శ్రీ నారా



చంద్రబాబు నాయుడు గారి పై నీచంగా దిగజారిన మాటలతో విరుచుక పడడం సరికాదని హెచ్చరించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసే జిమికులన్నీ ప్రజలు చూస్తున్నారని ఎటువంటి పరిస్థితుల్లో ప్రజలు జగన్మోహన్ రెడ్డిని నమ్మరు అని వైసీపీ నాయకులకు జగన్మోహన్ రెడ్డికి అంత చిత్తశుద్ధి ఉంటే ఈనెల జరిగే అసెంబ్లీ సెషన్ లో 11 మంది ఎమ్మెల్యేల తో హాజరై మీ అభ్యంతరాలు ఏంటో తెలపాలని మీ అభ్యంతరాలకు సమాధానం ఇవ్వడానికి 164 మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయ/వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తోళ్ల మంజునాథ్, జనసేన పార్టీ నాయకులు బజారి, షబ్బీర్, సుధాకర్, సంధ్యా విక్రమ్ కుమార్, సతీష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఛలో పోతిరెడ్డి పాడు కు తరలిన రైతులు వైసిపి నాయకులు



బనగానపల్లె ఫిబ్రవరి 5నందిపత్రిక వైయస్సార్ పార్టీ పిలుపుమేరకు తలపెట్టిన చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమానికి గురువారం బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఉదయమునుండే రైతులు నాయకులు పెద్ద సంఖ్యలో బనగానపల్లెలోని కాటసాని రామిరెడ్డి స్వగృహానికి చేరుకున్నారు మాజీ ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ శ్రీశైల జలాల్లో రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై మన పార్టీ పిలుపుమేరకు మనమంతా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద సమావేశం కావాల్సి ఉన్నదని అందరూ తమ వాహనాల్లో అక్కడికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరము పెద్ద ఎత్తున వాహనాల్లో పోతిరెడ్డిపాడు కు తరలి వెళ్లారు



# ఉద్యానవనాల అభివృద్ధికి కీలక అడుగులు

**6 పార్కుల అభివృద్ధికి మంత్రి టీ.జీ. భరత్ శంకుస్థాపన**

కర్నూలు నంది పత్రిక..... నగరంలో పచ్చదనాన్ని పెంపొందించి ప్రజలకు మెరుగైన విశ్రాంతి వాతావరణం కల్పించే దిశగా ఉద్యానవనాల అభివృద్ధికి కీలక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూ.1.05 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్న ఆరు పార్కుల పనులకు మంత్రి, కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరాన్ని స్మార్ట్ సిటిగా తీర్చిదిద్దడంలో భాగంగా ఒకేసారి రూ.1.05 కోట్లతో ఆరు పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. 2019 నుంచి 2024 వరకు పార్కులను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. తమ తండ్రి మంత్రిగా ఉన్న సమయంలో అనేక కాలనీల్లో పార్కులకు స్థలాలు గుర్తించి అభివృద్ధి చేశారని, అనంతరం వచ్చిన ఎమ్మెల్యేలు వాటిపై నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పార్కులను అభివృద్ధి చేస్తామని, ప్రతి పార్కులో నడకబాటలు, జిమ్ వంటి సదుపాయాలు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన గాలి కోసం విస్తృతంగా మొక్కలు నాటడం జరుగుతుందని చెప్పారు. పార్కుల అభివృద్ధి నగర సౌందర్యాన్ని పెంచడమే కాకుండా ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడుతుందని పేర్కొన్నారు. పిల్లలు, యువత, వృద్ధులు సేదతీరేలా అవసరమైన సదుపాయాలతో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో హరిత వాతావరణాన్ని మరింత విస్తరించే చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.కమిషనర్ మాట్లాడుతూ.. 45వ వార్డులోని ప్రేమ్‌నగర్ పార్క్-2ను రూ.15 లక్షలతో, 44వ వార్డులోని ఎంపీఎల్ ఎంప్లాయీస్ కాలనీ పార్క్‌ను రూ.15 లక్షలతో, ఎల్ఐసీ కాలనీ పార్క్‌ను రూ.25 లక్షలతో, 24వ వార్డులోని మధుర్‌నగర్ పార్క్‌ను రూ.15 లక్షలతో, 23వ వార్డులోని సీ క్యాంప్ పార్క్‌ను రూ.15 లక్షలతో, 25వ వార్డులోని బిర్లా భావన్ పార్క్‌ను రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, డిసిపి వెంకటరమణ, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈలు కృష్ణలత, పవన్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.



## హని ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ హని వర్షారెడ్డి




**కర్నూలు నంది పత్రిక.** .గురువారంఅబ్దుల్ ఖాన్ ఎస్టేట్ స్కందాన్ని బిజినెస్ హబ్ హనీ ఫౌండేషన్ ఆఫీసులో 50 మంది మహిళలకు నిరుపేదలకు ఉచిత చీరల పంపిణీ చేయడం జరిగింది. హనీ వర్ష రెడ్డి మాట్లాడుతూ మా వంతు సహాయంగా హని ఫౌండేషన్ తరపున ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుంటామని ప్రతి ఒక్కరు ముందుండాలని చైర్మన్ హని వర్ష రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో సిపిఐ పార్టీ శ్రావణి. మహేష్,, రాజు, సూరి, కళ్యాణి వినయ్,తదితరులు పాల్గొన్నారు.

## పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో భారత్ 'వాయు' గర్జన

భారత వాయుసేన తన సైనిక శక్తిని, వ్యూహాత్మక సంసిద్ధతను ప్రదర్శించేందుకు సిద్ధమైంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో, పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఫిబ్రవరి 27న 'వాయు శక్తి 2026' పేరిట భారీ వైమానిక విన్యాసాలు నిర్వహించనుంది. గతంలో సరిహద్దు దాటి ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన 'ఆపరేషన్ సిందూర్' తరహాలో ఈ విన్యాసాలను రూపొందించారు. ఈ ప్రదర్శన ద్వారా భారత వాయు శక్తి సామర్థ్యాలు మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించనున్నాయి.ఈ విన్యాసాల్లో వందకు పైగా విమానాలు పాల్గొననున్నాయని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. రఫేల్, సుఖోయ్-30, తేజస్, మిగ్-29, జాగ్వార్, మిరాజ్-2000, హాక్ వంటి యుద్ధ విమానాలు లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించనున్నాయి. వీటితో పాటు స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ప్రచండ్ అటాక్ హెలికాప్టర్ కూడా రాకెట్లను ప్రయోగిస్తుంది. వాయుసేన నుంచి వైదొలిగిన మిగ్-21 విమానం ఈ తరహా విన్యాసాల్లో కనిపించకపోవడం ఇదే తొలిసారి. ఒక కృత్రిమ యుద్ధ వాతావరణాన్ని సృష్టించి, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఏసీసీఎస్) ద్వారా ఈ మొత్తం విన్యాసాలను పర్యవేక్షించనున్నారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ విమానాలు, క్షిపణుల గమనాన్ని గుర్తించింది ఈ వ్యవస్థే. ఈ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా సి-295 రవాణా విమానం మొదటిసారిగా రాత్రిపూట అసాల్ట్ ల్యాండింగ్ డ్రిల్ నిర్వహించనుంది. సి-130జె సూపర్ హెర్క్యులస్ విమానం చిన్న రన్‌వేపై ల్యాండ్ అయి, గరుడ్ కమాండోలను దించి, వెంటనే టేకాఫ్ అవుతుంది. ఈ విన్యాసాల గురించి పాకిస్థాన్‌కు ముందస్తు సమాచారం అందించినట్లు, 'నోటీస్ టు ఎయిర్‌మెన్' (నోటామ్) జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## నారాయణరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన నాగార్జున రెడ్డి



**కాశినాయన ఫిబ్రవరి 4 (నంది పత్రిక):** కాశినాయన మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన కీర్తిశేషులు ముమ్మడి రెడ్డి నారాయణరెడ్డి పెద్దకర్మ కార్యక్రమం ఈరోజు వారి స్వగృహం ఓబులాపురంలో జరిగింది. ఈ సందర్భంగా నారాయణరెడ్డి కుమారుడు నాగేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పరామర్శించారు. అనంతరం నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ నారాయణరెడ్డి ఆత్మకు భగవంతుడు శాంతి కలగాలని ప్రార్థించారు.

# ప్రభుత్వ సేవల ద్వారా ప్రజా అభిప్రాయం మెరుగుపడాలి

### చిత్తశుద్ధితో పనిచేసి జిల్లాను మెరుగైన స్థానంలో నిలపాలి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 05 (నంది పత్రిక):-** ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవల ద్వారా ప్రజా అభిప్రాయం (పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్) మెరుగుపడేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. గురువారం నంద్యాల కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ రజియా సుల్తానా, జిల్లా సరఫరాల అధికారి రవిబాబు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డీఎల్‌డీఓ శివారెడ్డి, జిల్లాలోని 13 మండలాల సబ్ రిజిస్ట్రార్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవల పట్ల వారి సంతృప్తి స్థాయిని తెలుసుకునేందుకు ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థల ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. అయితే రాష్ట్ర స్థాయిలో రిజిస్ట్రేషన్ శాఖ చివరి స్థానంలో ఉండటం అత్యంత బాధాకరమని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్యాపిలి, డోన్, కోవెలకుంట్ల, బనగానపల్లె ప్రాంతాలు వెనుకబడి ఉండటంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పారదర్శకతతో, జవాబుదారీతనంతో సేవలు అందిస్తున్నప్పటికీ, ప్రజలకు అందే సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట అందిస్తున్న సేవల వివరాలతో కూడిన పెద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అవినీతికి పాల్పడినట్లయితే ఫిర్యాదు చేయడానికి సంబంధించిన ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, గ్రామ పంచాయతీ సేవలు వంటి అంశాలలో జిల్లాను మరింత మెరుగైన స్థానంలో నిలపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ పరిధిలో ప్రతి బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన టాయిలెట్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్‌ను ఆదేశించారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు కూడా ప్రజలకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లాగిన్ ను స్వయంగా ఓపెన్ చేసి, వివిధ శాఖలకు సంబంధించిన ప్రజల అభిప్రాయం కోసం అడిగే ప్రశ్నలను చదివి వినిపిస్తూ, వాటి ఆధారంగా ప్రజా సంతృప్తి పెరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## 100 ఎకరాల భూకబ్జా యత్నం అడ్డుకున్న ఆర్డీఓ, పోలీసులు



**కాశినాయన ఫిబ్రవరి 4( నంది పత్రిక):** కడప జిల్లా కాశినాయన మండలంలో భారీ భూకబ్జా యత్నం వెలుగుచూసింది. మండలంలోని మూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్1లో 100 ఎకరాలకు పైగా భూమిని అక్రమంగా చదును చేస్తున్న భూకబ్జాదారులను ఆర్డీఓ చంద్రమోహన్, పోలీసులు అడ్డుకున్నారు.సమాచారం అందుకున్న ఆర్డీఓ చంద్రమోహన్ తక్షణమే పోలీసులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా భూమి చదును చేస్తున్న రెండు హిటాచీలు, ఒక జేసీబీ, ఒక టిప్పర్ వాహనాన్ని అధికారులు సీజ్ చేశారు.ప్రభుత్వ భూములపై భూకబ్జాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ హెచ్చరించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని కాశినాయన తహసీల్దార్‌ను ఆర్డీఓ చంద్రమోహన్ ఆదేశించారు. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించే వారిని ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.



## ఘనంగా ఏఐటీయూసీ జిల్లా మహాసభలు నిర్వహిద్దాం

### ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వి రఘురామ్మూర్తి




**నందికొట్కూరు ఫిబ్రవరి 5(నందిపత్రిక )** పట్టణంలో ఏప్రిల్ నెల ఆరు, ఏడు తేదీలలో ఏఐటియుసి నంద్యాల జిల్లా ప్రథమ మహాసభలు నిర్వహిస్తున్నామని అధిక సంఖ్యలో కార్మికులు,కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష&కార్యదర్శులు రఘురాంమూర్తి , సుంకయ్య లు కార్మికవర్గానికి పిలుపునిచ్చారు .నంద్యాల జిల్లా మహాసభలను నందికొట్కూరులో నిర్వహించాలని నిర్ణయిచిన ఏఐటీయూసీ రాష్ట్ర సమితి నాయకత్వానికి ఆర్ రవీంద్రనాథ్ ,వెంకటసుబ్బయ్య రాధాకృష్ణమూర్తి ,కొండలయ్య, మునెప్ప తదితరులకు ఏఐటీయూసీ జిల్లా సమితి ప్రత్యేక అభినందనలు తెలిపారు .స్థానిక పట్టణంలోని పటేల్ సెంటర్ నందు కార్మిక సంఘాల ముఖ్య నాయకులు కార్యకర్తలు కలిసి టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజులపాటు (ఏప్రిల్ 6 ,7 )జరిగే మహాసభలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పైన సుదీర్ఘ చర్చల అనంతరం కార్మిక హక్కుల కోసం వారి ఉపాధి రక్షణ కై పని భద్రతకు తదితర అంశాల పైన భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందింస్తామని వారు తెలిపారు .ఈకార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సుంకన్న , రాముడు వెంకటేశ్వర్లు, నాగస్వాములు ఉస్మాన్ భాష ,హంద్రీనీవా శ్రీనివాసులు , పటాన్ మౌలాలి, కే రెహమాన్ ,నాగేంద్ర,మున్నా జగదీష్ ,శంకర్ నాయుడు ,మధు,చిన్ని ప్రతాప్ తదితరులు ఉన్నారు.

## రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని తక్షణమే పూర్తి చేయాలి : ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



**బద్వేల్, ఫిబ్రవరి 5 (నంది పత్రిక ):** రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై చంద్రబాబు నాయుడు అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా వైయస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఛలో పోతిరెడ్డిపాడు' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ప్రాంతాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో సాగు, త్రాగునీటి అవసరాల కోసం ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. అలాగే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో సీమ ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలం ప్రాజెక్టులో 800 అడుగుల నీటిమట్టం చేరకముందే నీటిని తరలిస్తున్న పరిస్థితుల్లో, వాటిని అరికట్టేందుకు మరియు రాయలసీమ ప్రజలకు సాగు, త్రాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని తీసుకువచ్చారని తెలిపారు.అయితే సీమ ప్రజలకు రావాల్సిన 22 టీఎంసీల నీటిని రాకుండా చంద్రబాబు నాయుడు తెలంగాణ ప్రభుత్వంతో కలిసి అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఎత్తిపోతల పథకం పూర్తికాకపోతే రాయలసీమ ప్రాంతం తీవ్ర కరువుతో అల్లాడే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. రానున్న రోజుల్లో సీమకు న్యాయం జరగాలంటే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ రైతుల హక్కుల కోసం, నీటి న్యాయం కోసం వైయస్ఆర్‌సీపీ అచంచలంగా పోరాటం చేస్తుందని డీసీ గోవిందరెడ్డి స్పష్టం చేశారు.

## నిరంతర కృషితోనే అద్భుత ఫలితాలు.

### -మోడల్ పేపర్స్ పంపిణీలో డిసిసిబి చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి



**బద్వేల్, ఫిబ్రవరి 5( నంది పత్రిక ):** నిరంతర సాధన, కృషితోనే అద్భుత ఫలితాలు సాధించవచ్చని కడప జిల్లా డిసిసి బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం బద్వేలులోని బాలుర ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీచే రూపొందించిన పదవ తరగతి మోడల్ పేపర్స్ ను తన సొంత ఖర్చులతో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి మాసంలో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నందున విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు ఇప్పటినుండే ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు. బాల్యంలో ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని, క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత స్థానం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున ఈ సమయం అత్యంత కీలకమైనదని, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని పాఠ్యాంశాలను ప్రణాళిక బద్ధంగా చదువే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అన్ని వసతులను కల్పిస్తున్నదని, ప్రత్యేకించి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలపై, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారన్నారు. విద్యా సామాగ్రిని, సమరూప దుస్తులను ఇవ్వడంతోపాటు, పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం వంద రోజుల ప్రణాళికను రూపొందించి మెరుగైన ఫలితాలను సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్స్ ను విద్యార్థులు చక్కగా వినియోగించుకొని అద్భుత ఫలితాలను సాధించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.సుధాకర్, కె.జోజయ్య, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ నిరంతరం ఎన్నో ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న డిసిసి బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి తన సొంత ఖర్చులతో విద్యార్థులకు మోడల్ పేపర్స్ అందించి విద్య దానానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. బద్వేలు మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 500 మంది విద్యార్థులకు వేలాది రూపాయలు వెచ్చించి, మోడల్ పేపర్స్ ను ఉచితంగా అందించడం గొప్ప విషయమన్నారు. సదుద్దేశంతో మంచూరు సూర్యనారాయణ రెడ్డి అందజేసిన మోడల్ పేపర్స్ ను విద్యార్థులు పూర్తిగా సద్వినియోగపరచుకోవాలని కోరారు. యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్స్ ప్రతి సంవత్సరం అద్భుత ఫలితాలను సాధించేందుకు దోహదపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ బద్వేలు మండల అధ్యక్షులు ఎస్.దేవానందం, జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.మురళీకృష్ణ, కొండయ్య, సగిలి బాలయ్య, ఆర్.రమణ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు,టీడీపీ నాయకులు ఓబుళాపురం రాజశేఖర్,గాజులపల్లి శంకర్ రెడ్డి మాజీ కౌన్సిలర్,జయ రామి రెడ్డి మాజీ మండల అధ్యక్షుడు,కొంకుల రాంబాబు బద్వేలు మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు,అరవ శ్రీనివాస రెడ్డి,కల్లూరి దుగ్గి రెడ్డి,శంకర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి,రామకృష్ణ రెడ్డి,నవీన్ కుమార్ రెడ్డి,చిన్నప్ప రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



## సర్వేలు సర్వర్ లేదు ఇదే సచివాలయ సాకులు!

### సచివాలయాలపై హ్యూమన్ రైట్స్ సంఘం ఆగ్రహం




**పోరుమామిళ్ల ఫిబ్రవరి 4 (నంది పత్రిక ):** పోరుమామిళ్ల మండలంలోని గ్రామ సచివాలయాలు నిద్రావస్థలో ఉన్నాయని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ప్రజలు వివిధ సర్టిఫికెట్లు, అప్డేట్ల కోసం సచివాలయాలకు వెళ్తే, అక్కడి సిబ్బంది మాత్రం "సర్వేలు ఉన్నాయి", "సర్వర్ పని చేయడం లేదు" అంటూ ఏదో ఒక సాకుతో ప్రజలను తిరస్కరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.సచివాలయ సిబ్బంది కుర్చీలపై కూర్చొని సెల్‌ఫోన్లు చూస్తూ టైంపాస్ చేయడం, ప్రజల పనులు చేయక మీసేవ కేంద్రాలకు పంపించేయడం పరిపాటిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. పై అధికారులు కూడా ఈ వ్యవహారాన్ని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని విమర్శిస్తున్నారు.ప్రజలకు సౌకర్యవంతమైన పరిపాలన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి అన్ని వసతులతో సచివాలయ భవనాలు నిర్మించినా, అక్కడ పనిచేసే సిబ్బంది మాత్రం విధులకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిర్ణీత సమయానికి కార్యాలయాలకు రాకపోవడం, ప్రజల పనులు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిపై ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సచివాలయాల్లో పనిచేస్తున్న నిర్లక్ష్య సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ చీఫ్ గంగన్న, సెక్రటరీ ఫణిరావు, ఆఫీస్ సెక్రటరీ పూజ, ప్రెస్ సెక్రటరీ ప్రవీణ్ డిమాండ్ చేశారు. సచివాలయ సిబ్బందిపై కలెక్టర్ తగు చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని వారు కోరారు.



## ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి.

**సిఐటియు మండల కార్యదర్శి జల్లె జయరాజ్.**



**కేసముద్రం, ఫిబ్రవరి 05(నంది పత్రిక)**:గురువారం కేసముద్రం మండల కేంద్రంలోని సాధికార మండల సమైక్య కార్యాలయంలో డిఆర్డిఏ ఏపిఎం కృష్ణమూర్తికి సిఐటియు అనుబంధ తెలంగాణ ఐకెపి ఎంప్లాయిస్ యూనియన్ కేసముద్రం ఐకెపి వివోఏ మండల అధ్యక్ష, కార్యదర్శులు వచ్చాల సాంబయ్య, భూక్య నెహ్రూ ఆధ్వర్యంలో ఏపీఎంకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొడిషాల వెంకన్న మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు, పెట్టుబడిదారులకు అప్పజెప్తూ కార్మికులకు ఉపాధి లేకుండా, ఉన్న ఉద్యోగాలనే తొలగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాదిమంది కార్మికులు ప్రాణాలు అర్పించి పోరాడి తెచ్చుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కార్మికులకు ఉరితాళ్లుగా మారే నాలుగు లేబర్ కోడలు తెచ్చి 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి కార్మిక వర్గ శ్రమను కార్పొరేట్లకు దోచిపెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించి నాలుగు లేబర్ కూడా రద్దుచేసి 29 కార్మిక చట్టాలను కొనసాగించాలన్నారు. ఈ నెల 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కేసముద్రం మండల ప్రజలు, సిఐటియు అనుబంధ రంగాల కార్మికులు అందరు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాందాటి కళావతి, లక్ష్మణ్, గోవర్ధన్, విమల, ఉమ, యాకలక్ష్మి, మంజుల, అనిత తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల ఖర్చులపై అభ్యర్థులకు అవగాహన సదస్సు.



**కేసముద్రం, ఫిబ్రవరి 05(నంది పత్రిక)**:మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పాటించాల్సిన నియమ నిబంధనలు, ఎన్నికల ఖర్చులపై కేసముద్రం రైతు వేదికలో గురువారం అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు, ఎన్నికల వ్యయానికి సంబంధించిన నిర్వహణపై లెక్కలను సక్రమంగా నిర్వహించాలని జిల్లా మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు శ్రీనివాస్ ఆదేశించారు. అభ్యర్థులకు ఎన్నికల వ్యయంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ ఎన్నికల ఖర్చులను సక్రమంగా నమోదు చేయాలని, ఎన్నికల అనంతరం ఖర్చుల నివేదికను నిర్ణీత గడువు లోగా ఎన్నికల అధికారులకు సమర్పించాలని కోరారు. ఈ నెల 5,7,9 తారీకులలో ఎన్నికల వ్యయ ఖర్చులను అభ్యర్థులు సహాయ ఎన్నికల వ్యయ అధికారికి సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల నోడల్ అధికారి ప్రవీణ్, కేసముద్రం మున్సిపాలిటీ ఎన్నికల సహాయ వ్యయ నిర్వహణ అధికారి జె.మనోహర్ రావు, సిఐ సత్యనారాయణ, ఎస్ ఐ లు క్రాంతి కిరణ్, నరేష్, వ్యవసాయాధికారి వెంకన్న, ఇతర ఎన్నికల వ్యయ నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.




## మేడారం జాతరలో బాలికపై అత్యాచారం వట్టిదే.. తేల్చిన జాతీయ మహిళా కమిషన్

ఇటీవల ముగిసిన సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ జరిగిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదని జాతీయ మహిళా కమిషన్ (చీజబౌ) ప్రాథమిక విచారణలో తేలింది. మీడియా, సోషల్ మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఏర్పాటు చేసిన విచారణ కమిటీ, గురువారం తెలంగాణలోని ములుగు జిల్లాలో పర్యటించింది. ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలు డెలినా ఖోంగ్‌దుప్ నేతృత్వంలోని ఈ బృందం, ములుగు కలెక్టరేట్‌లో కలెక్టర్ టి.ఎస్. దివాకర, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్‌లతో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకుంది. అనంతరం, అత్యాచారం జరిగినట్లుగా ప్రచారమైన మేడారం జాతర పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ప్రాథమిక విచారణలో భాగంగా, జాతరలో అలాంటి దురదృష్టకర సంఘటన ఏదీ జరగలేదని నిర్ధారణకు వచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించిన మార్కెట్ చైర్మన్.



**కేసముద్రం, ఫిబ్రవరి 05(నంది పత్రిక)**: కేసముద్రం మున్సిపాలిటీలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోరుతూ గురువారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఏడు, ఎనిమిది, పదవ వార్డులు, అమీనాపురం 5 వ వార్డు కౌన్సిలర్లుగా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు రడం శ్రీనివాస్, రడం శివజ్యోతి, అంబటి లక్ష్మి మహేందర్ రెడ్డి ల చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీని వాళ్ళ ఖాతాలలో జమ చేయడం జరిగిందని, మున్సిపాలిటీ పరిధిలో వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ముఖ్యంగా అమీనాపురం గ్రామానికి మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ 29 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తే వాటిలో అధికంగా 10 ఇండ్లను పేద దళిత కుటుంబాలకు కేటాయించినట్లు ప్రజలకు తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బిఆర్ఎస్ నాయకులు గ్రామానికి 400 ఇండ్లు తెస్తామని ఒక్క ఇల్లు కూడా ఇవ్వని విషయాన్ని గమనించాలని కోరారు. హనుమంతరావు నగర్ కాలనీలో మొత్తం కాలనీ సిసి రోడ్లతో బాగు చేయడంతో పాటు మీ వెన్నంటే ఉండి 5వ వార్డు అభివృద్ధిని ఎమ్మెల్యే మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్ సహాయ సహకారాలతో చేస్తామని హామీ ఇస్తూ మీ ఓట్లు వేసి గెలిపించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి కోరారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి పాటుపడుతుందనీ, కేసముద్రం మున్సిపాలిటీ అయిన తర్వాత సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి దళితుల 25 సంవత్సరాల ఆకాంక్షను నెరవేర్చడానికి అమీనాపురంలో అంబేద్కర్ భవనాన్ని నిర్మించడానికి ఒక్క కోటి 50 లక్షల రూపాయలను మంజూరు చేశారని, మండల వ్యాప్తంగా ఉన్న దళితుల ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ కి వెన్నుదన్నుగా ఉండాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు ఏమి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులను ముఖ్యమంత్రి చేస్తానని మాట తప్పిన బిఆర్ఎస్ నాయకులు, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని ఇవ్వని వైనాన్ని, ఈరోజు దళితుల పట్ల కపట ప్రేమతో మొసలి కన్నీరు కారుస్తున్నారు. కాబట్టి నమ్మకండి మరొకసారి మోసం చేయడానికి వస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ ప్రచారంలో ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్న యాదవ్, రాష్ట్ర నాయకులు నీలం దుర్గేష్, బండారు దయాకర్, కూరెల్లి సతీష్, మాజీ ఎంపీటీసీ రవి నాయక్, గుజ్జునూరి బాబురావు, మిట్టగడుపుల యాకూబ్, జన్ను కట్టయ్య, వేల్పుగొండ ఆనంద్, ఇనుముల కర్ణాకర్, యారా సాగర్, చీకటి సతీష్, సింగిరెడ్డి కృష్ణ, నద్దునూరి సారంగం, లాకావత్ మంగమ్మ, బాలు నాయక్, బంటు శ్రవణ్, భూక్య శ్రీనివాస్, జాటోత్ రమేష్, భోగం రమాదేవి, చందుపట్ల కవిత, జన్ను సుశీల తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపురంలో కొనసాగుతున్న భూ సర్వే



**కేసముద్రం, ఫిబ్రవరి 05(నంది పత్రిక)**:మండలం లోని నారాయణపురం గ్రామంలో ప్రభుత్వ ఆదేశానుసారం 1827 ఎకరాలకు గాను 43 సర్వే నెంబర్లలో సర్వే కోసం జీవో జారీ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో గత నెల 27న గ్రామసభ నిర్వహించిన అనంతరం గ్రామ సరిహద్దులను గుర్తించారు. నేటితో గ్రామ కంఠం సరిహద్దులు నిర్ణయించి తదుపరి ప్రభుత్వ స్థలాలు, అనంతరం గ్రామంలోని రైతులకు సంబంధించిన భూములను సర్వే చేయడం జరుగుతుందని ఏడి నూర్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐ లుర్దు, ఆర్ఐ మజీద్, సర్వేయర్ శ్రవణ్, జిపిఓ బాలకృష్ణ, లైసెన్స్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

## నరసాపురం, తణుకు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో జనరల్ కేటగిరిలో మద్యం బార్లు లాటరీ పద్ధతి ద్వారా కేటాయింపు.

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 5 నంది పత్రిక** భీమవరం కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరం నందు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నరసాపురం ఒకటి, తణుకు రెండు మొత్తం మూడు మద్యం బార్లను జనరల్ కేటగిరీలో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసి కేటాయించడం జరిగింది. నరసాపురం మద్యం బార్ కు లాటరీ పద్ధతి ద్వారా అంగర వరప్రసాద్ ఎంపిక కాగా, రిజర్వ్ వన్ అండ్ టు అభ్యర్థులుగా శ్రీరామకృష్ణ, బొలిశెట్టి నాగ వెంకట సత్యనారాయణ లు ఎంపిక కావడం జరిగింది. ఒకవేళ అంగర వరప్రసాద్ నిర్ణీత ఫీజు చెల్లింపు చేయని పక్షంలో, వరుస క్రమంలో రిజర్వ్ అభ్యర్థులకు బార్లు కేటాయింపు జరుగుతుంది. తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు మద్యం బార్లకు విడివిడిగా రెడ్డి వీర వెంకటరత్నం, జుజ్జువరపు సత్యనారాయణ ఒక్కొక్కరు నాలుగు దరఖాస్తులు వేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మొత్తం ఎనిమిది మద్యం బార్లకు టెండర్లు పిలవగా ఈరోజు లాటరీ పక్రియలో నరసాపురం 1, తణుకు రెండు మొత్తం మూడు బార్లను కేటాయించగా, ఇంకా తాడేపల్లిగూడెంలో నాలుగు, తణుకులో ఒకటి మొత్తం ఐదు మద్యం బార్లకు ఎవరు దరఖాస్తు చేసుకోలేదు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారి ఆర్.వి ప్రసాద్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్లు కె.బలరామరాజు, కళ్యాణ్ చక్రవర్తి, రమేష్, మణికంఠ రెడ్డి, స్వరాజ్యలక్ష్మి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు..

## 12వ వార్డు ప్రచారంలో దూసుకుపోతున్న తరాల వీరేష్ యాదవ్.







**కేసముద్రం, ఫిబ్రవరి 05(నంది పత్రిక)**:కేసముద్రం మున్సిపాలిటీలో 12వ వార్డు కౌన్సిలర్ గా కాంగ్రెస్ అభ్యర్థి తరాల వీరేష్ యాదవ్ ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి జరుగుతుందని, 12వ వార్డు అభివృద్దే లక్ష్యంగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వీరేష్ యాదవ్ ఓటర్లకు తెలుపుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. అధికార పార్టీకి ఓటు అభివృద్ధికి మలుపంటూ, 12వ వార్డు సమస్యల పరిష్కారానికి ప్రజా గొంతుకగా పనిచేయడానికి ప్రజలందరూ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

## బిఆర్ఎస్ జోష్ కు కాంగ్రెస్ లో గుబులు: మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్.

**8, 10 వార్డుల్లో కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్ లోకి చేరికలు.**





**కేసముద్రం, ఫిబ్రవరి 05(నంది పత్రిక)**:కేసముద్రం మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభంజనానికి అధికార కాంగ్రెస్ వెన్నులో వణుకు పుడుతుందని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. గురువారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో గల 8,10 వార్డుల్లో కాంగ్రెస్ నాయకుడు బాషబోయిన వెంకన్నతో సహా కాంగ్రెస్ ని వీడిన 100 మందికి పైగా కార్యకర్తలు బిఆర్ఎస్ లో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మున్సిపాలిటీ ఎన్నికల కోఆర్డినేటర్ సతీష్ రెడ్డిలు బిఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6గ్యారెంటీలు, 420 హామీల అమలు చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసిందని, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు బిఆర్ఎస్ వైపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వైపు చూస్తున్నారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థుల కారు గుర్తుపై ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మర్రి రంగారావు, మండల అధ్యక్షులు నజీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, ఉద్యమ నాయకులు ఊకంటి యాకూబ్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు వీరు నాయక్, మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, వివిధ వార్డులలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఇంచార్జీలు తదితరులు పాల్గొన్నారు.



## కేసముద్రం, తొర్రూరు మండలాలలో విస్తృతంగా పర్యటించిన ఎన్నికల పరిశీలకులు.



**కేసముద్రం, ఫిబ్రవరి 05(నంది పత్రిక)**:మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్ ఐఏఎస్ గురువారం కేసముద్రం, తొర్రూరు మండలాలలో విస్తృతంగా పర్యటించారు. కేసముద్రంలో పోలింగ్ స్టేషన్ లు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రాలను, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం తొర్రూరు మండల కేంద్రంలో కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జిల్లాలో పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, క్షేత్రస్థాయి సిబ్బంది నుండి ప్రతి ఒక్కరూ ఎలక్షన్ రూల్స్ ను తప్పక పాటించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలు, పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు తదితర ప్రదేశాలలో సిబ్బందికి, ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ తదితర విభాగాల సిబ్బంది నిత్యం తనిఖీలు నిర్వహించాలని ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రతి ఒక సంబంధిత సిబ్బంది కృషి చేయాలని కోరారు. ప్రచార సామాగ్రి, మైక్, సభలు, వాహన అనుమతులు ముందస్తుగా తీసుకోవాలని ఎన్నికల నిబంధనలు పాటించే విధంగా అభ్యర్థులకు స్థానిక సిబ్బంది మున్సిపల్ కమిషనర్లు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇప్పటికే ఐదు మున్సిపల్ ఎన్నికలు జరిగే పరిధిలలో సిబ్బందిని నియమించడం జరిగిందని వారికి పలు దఫాలలో శిక్షణ తరగతులు కూడా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తనిఖీలలో అబ్జర్వర్ వెంట స్థానిక మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.



# ప్రజా పాలన కాదిది.. ప్రజా రోదన పాలన.





## రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర. కేసముద్రంలో బిఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశం.

**కేసముద్రం, ఫిబ్రవరి 05(నంది పత్రిక):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ చెప్పుకుంటున్న ప్రజా పాలనలో ప్రజలు అనేక రోదనలు, వేదనలు పడుతున్నారని, ప్రజా పాలన కాదిది, ప్రజారోధన, ప్రజా వేదన పాలన అని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. గురువారం కేసముద్రం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలోని హరిహర గార్డెన్ లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. మాయమాటలతో, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాల్సింది పోయి డైవర్షన్ రాజకీయాలతో పబ్బం గడుపుకుంటుందని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగిన ప్రతి సందర్భంలో నోటీసులంటూ కాలయాపన చేయడమే ప్రభుత్వ పనిగా మారిందని ఎద్దేవా చేశారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల అభివృద్ధికి కృషిచేసిన బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల కారు గుర్తుపై ఓటు వేసి మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసముద్రం మున్సిపాలిటీలో బిఆర్ఎస్ గెలుపు కెసిఆర్ ముఖ్యమంత్రి కావడానికి మలుపు అన్నారు. ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మాజీ ఎంపీ కవిత మాలోత్, మాజీ ప్రభుత్వ విప్ దాస్యం వినయ్ భాస్కర్, కేసముద్రం మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ సతీష్ రెడ్డి, మండల అధ్యక్షులు నజీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు రంగారావు, జిల్లా నాయకులు రావుల రవిచందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీనాథ్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ మర్రి నారాయణ రావు, వీరు నాయక్, హరి నాయక్ యాకుబ్ రెడ్డి, 16 వార్డుల నుండి పోటీ చేస్తున్న అభ్యర్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.






## తహసిల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 5 నంది పత్రిక** రైతులకు పంపిణీ చేసే పట్టాదార్ పాస్ పుస్తకాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులు ఆదేశించారు. భీమవరం తహసిల్దార్ కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం పాత రికార్డులను పరిశీలించారు. ముఖ్యముగా ప్రస్తుతం రైతులకు జారీ చేసే పట్టాదారు పాసు పుస్తకములు వెరిఫికేషన్ ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. రైతులకు జారీ చేసే పట్టాదారు పాసు పుస్తకాలులో నమోదైన భూ వివరాలు సర్వే నెంబర్లు, విస్తీర్ణం, యజమాని పేరు, తదితర అంశాలు క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని జిల్లా కలెక్టర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకములలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు అత్యంత కీలకమైన పత్రాలని అన్నారు. వీటిలో ఏ చిన్న తప్పు పడిన సంబంధిత రైతు ఇబ్బందులు పడతారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే రైతులకు పాసుపుస్తకాలు జారీ చేయాలని అన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు వెరిఫికేషన్ ఆలస్యం కాకుండా త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ రావి రాంబాబు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



# ప్రజలకు మరిన్ని మేరైన సర్వీసులు అందించడానికి సకాలంలో పన్నులు వసూలు చేయాలి....






**ప్రజలు వారు పొందుతున్న సర్వీసులకు పన్నులు కట్టడానికి సిద్ధంగా ఉన్న ఉద్యోగుల అలసత్వం కనిపిస్తుంది...**

**వివిధ రకాల పన్నులు వసూలు చేయడానికి నిరంతరాయ చర్యలు అవసరం ...**

**గ్రామాలను పరిశుభ్రతగా ఉంచడానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలి**

**రోడ్లు వేసే ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించిన తర్వాత మాత్రమే రోడ్లు పనులను ప్రారంభించాలి**

**భీమవరం: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 5, నంది పత్రిక.** భీమవరం పట్టణం లోసరి రోడ్డు లోని విష్ణు కన్వెన్షన్ నందు గురువారం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన "పంచాయతీరాజ్ కార్యకలాపాలపై సమీక్ష" సమావేశానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమీక్ష సమావేశంలో పన్నులు, పన్నేతర వసూలు, వర్మిక పోస్ట్ తయారీ, అందుబాటులో ఉన్న ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు, పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులు, ఐ వి ఆర్ కాల్స్ అభిప్రాయ సేకరణ, తదితర అంశాలపై పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సకాలంలో పన్నులు వసూలు చేస్తేనే ప్రజలకు మరిన్ని మెరుగైన సర్వీసులను అందజేయగలుగుతామన్నారు. పన్నుల వసూలలో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది అందరూ పన్నులు వసూళ్లులలో శ్రద్ధ కనబరచాలని, రానున్న మూడు రోజుల్లో మంచి ప్రగతి కనిపించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు ఇన్చార్జులుగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. ఇంటి పన్ను, ఆస్తి పన్ను, కుళాయి పన్ను, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థల పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, సెల్ టవర్స్, చెరువులు తదితర వేలం పాటల పన్నుల ప్రగతిపై అంశాల వారీగా సమీక్షించారు. పన్నులు వసూళ్లలో వెనుకబడిన పంచాయతీ సిబ్బందిని గట్టిగా నిలదీశారు. ప్రజలకు అందిస్తున్న సర్వీసులకు పన్నులను వసూలు చేయకపోతే మళ్లీ తిరిగి వారికి ఏ విధంగా మేలైన సర్వీసులను అందించగలుగుతాం అని ప్రశ్నించారు. పన్నుల వసూళ్లలో ఎవరు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు వారానికి రెండు రోజులు గ్రామాల్లో పన్నుల వసూళ్లపై పర్యవేక్షించాలన్నారు.

**గ్రామాలలో పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి** కొన్ని గ్రామాలలో చెత్త సేకరణ కూడా సరిగ్గా జరగటం లేదని, దీనిపై ప్రజాస్పందన లేదు అనేదే ఎక్కువ శాతం నమోదవుతుందన్నారు. చెత్త సేకరణ పక్కాగా నిర్వహించాలని ప్రతి ఇంటికి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. తూర్పు తాళ్ల, మరికొన్ని ప్రాంతాల్లో ఆవులు, గేదెలను ఇష్టానుసారం రోడ్లపై వదిలేయడంతో ఎంతోమంది ప్రమాదాలకు గురి అవుతున్నారు అన్నారు. సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చి పశువులు రోడ్డు మీదకు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీరవాసరం, పాలకొల్లు ఎంట్రన్స్, తణుకు, గొల్లలకోడేరు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా రోడ్ల పక్కన చెత్త కుప్పలు కనిపిస్తున్నాయన్నారు. రోడ్ల పక్కన చెత్త కుప్పలు కుప్పలుగా వేయకుండా పర్యవేక్షించాలి అన్నారు. ఎస్.డబ్ల్యూ.పి.సి నూరు శాతం వినియోగంలోనికి తీసుకురావాలని ఆదేశించారు.

**రోడ్లు వేసే ముందు ఆక్రమణలను తొలగించాల్సిందే**

రోడ్లు వేసే ముందు ఎట్టి పరిస్థితుల్లో అక్రమణలను తొలగించిన తర్వాతనే రోడ్డుపనుల ప్రారంభించాలని ఆదేశించారు. రోడ్డు మార్జిన్ లో ఆక్రమణలు కారణంగా రోడ్లు ఇరుకుగా ఉండి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు ఆక్రమణలను తొలగించాలన్నారు. ఎక్కడపడితే అక్కడ ఆక్రమిస్తే చూస్తూ ఊరుకోరాదని, ప్రారంభంలోనే అడ్డుకోవాలన్నారు. ఏదన్నా సమస్య వస్తే జిల్లా యంత్రాంగం దృష్టి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతివారం పి జి ఆర్ ఎస్ లో వివిధ రకాలపై ఆక్రమణలపై ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఏకికుత కుటుంబ సర్వే, ఐ గాట్ కర్మయోగి కోర్సులు, అప్సడా, సిఏఏ రిజిస్ట్రేషన్ లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎన్. రామనాథ్ రెడ్డి, డిజిటల్ పంచాయతీ అధికారి ఐ.జ్యోతిర్మయి,, డి ఎల్ డి వో లు జి.రవి, ప్రభాకర్, డిప్యూటీ ఎంపీడీవోలు, గ్రేట్ వన్ అండ్ టు పంచాయతి సెక్రటరీలు, జూనియర్ అసిస్టెంట్లు,పాల్గొన్నారు. .



## విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 5 నంది పత్రిక** భీమవరం పి.ఎస్.ఎం బాలికల ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మిక సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధించేందుకు రూపొందించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలను సాధించి రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ మంచి పేరును తీసుకురావాలని అన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ రోజువారి టెస్టులు, రివిజన్ తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పదో తరగతి పరీక్షలు జీవితంలో కీలకమైన మైలురాయిగా భావించి విద్యార్థులు కష్టపడి చదవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.



# పామాయిల్ సాగు చరిత్రలో తొలిసారి తెలంగాణకన్నా ఏపీలోనే అధిక ధర

## రైతులకు గిట్టుబాటు ధర...కూటమి ప్రభుత్వ నిర్ణయాలకు హర్షం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి పామాయిల్ రైతుల ప్రత్యేక కృతజ్ఞతలు



**అమరావతి, బ్యూరో చీఫ్ ఫిబ్రవరి 5: నంది పత్రిక** పామాయిల్ పంట సాగు చరిత్రలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే అధిక ధర లభించడం రాష్ట్ర రైతుల్లో ఆనందోత్సాహాలను నింపింది. ఈ చారిత్రాత్మక పరిణామానికి కారణమైన కూటమి ప్రభుత్వ నిర్ణయాల పట్ల పామాయిల్ రైతులు, పామాయిల్ అసోసియేషన్ సభ్యులు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇతర సంప్రదాయ పంటల నుంచి పామాయిల్ సాగు వైపు రైతులు పెద్ద సంఖ్యలో మొగ్గుచూపుతున్నారని, కూటమి ప్రభుత్వ విధానాల వల్ల తొలిసారి పామాయిల్ రైతులు నిజమైన సంతృప్తిని పొందుతున్నారని రైతులు ఈ సందర్భంగా తెలిపారు. ముఖ్యంగా సరైన సమయంలో ఉన్నతమైన గిట్టుబాటు ధరను ప్రకటించడం వల్ల రైతులకు ఆర్థిక భరోసా కలిగిందని, పామాయిల్ సాగు విస్తరణ వల్ల రాష్ట్రంలో క్రాప్ డైవర్సిఫికేషన్ విజయవంతంగా అమలవుతోందని రైతులు పేర్కొన్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా పామాయిల్ సాగు రైతులకు భరోసాగా మారిందన్నారు. అలాగే సాగు వ్యయాన్ని తగ్గించేలా డ్రిప్ పరికరాలపై సబ్సిడీని సరైన సమయంలో అందించడం ప్రభుత్వం తీసుకున్న అత్యంత కీలక నిర్ణయమని ప్రశంసించారు. పంట దిగుబడి వచ్చిన వెంటనే సరైన సమయంలో గిట్టుబాటు ధరను కల్పించడం వల్ల మార్కెట్ ఒడిదుడుకులకు భయపడాల్సిన అవసరం లేకుండా రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని తీసుకుంటున్న నిర్ణయాలు పామాయిల్ సాగుకు కొత్త దిశను చూపుతున్నాయని రైతులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తీసుకున్న ఈ దూరదృష్టి గల నిర్ణయాలతో రానున్న రోజుల్లో పామాయిల్ సాగు మరింత విస్తరిస్తుందని, రాష్ట్రం ఆయిల్ పామ్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలిచిన, సీఎం చంద్రబాబు సారధ్యంలో, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

**రైతులకు రికార్డు ధర... మెట్రిక్ టన్నుకు రూ. 20,680 : మంత్రి అచ్చెన్నాయుడు** 2025–26 ఆయిల్ ఇయర్ (నూనె సంవత్సరం) కు గాను 20.01% ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో (రాజు=) ను ప్రభుత్వం ప్రకటించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మన రాష్ట్ర పామ్ ఆయిల్ రైతులకు మెట్రిక్ టన్నుకు రూ. 20,680/– ధర లభించిందని, జనవరి నెలకు గాను తెలంగాణ రాష్ట్ర పామ్ ఆయిల్ రైతులకు మెట్రిక్ టన్నుకు రూ.20,456/– లు లభించగా, మన రైతులకు రూ. 20,680/– ల ధర లభించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల తెలంగాణ కన్నా మన రైతులకు మెట్రిక్ టన్నుకు రూ. 224/– అదనంగా లభించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆయిల్ పామ్ విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతలో దేశంలోనే తొలి స్థానంలో ఉందని, రాష్ట్రవ్యాప్తంగా 1.97 లక్షల మంది రైతులు 2.49 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేస్తూ, లాభదాయక పంటగా మలుస్తున్నారని అన్నారు. 202425 నూనె సంవత్సరానికి ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాల వల్ల ఆయిల్ పామ్ రైతులకు మెట్రిక్ టన్నుకు సగటున రూ.19,579 ధర లభించిందని, ఇది గత పదేళ్లలోనే అత్యధికమని మంత్రి వెల్లడించారు. ఈ ధరలతో రైతుల్లో విశ్వాసం పెరిగి ఆయిల్ పామ్ సాగుపై సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. 202526 ఆర్థిక సంవత్సరంలో 24,535 హెక్టార్లలో కొత్త ఆయిల్ పామ్ తోటల విస్తరణ సాధించామని, ఇది గత దశాబ్దంలోనే రికార్డుగా నిలిచిందని తెలిపారు. ఇప్పటివరకు రూ.181.28 కోట్ల నిధులు విడుదల చేసి, రూ.137.28 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. జాతీయ నూనె గింజల మిషన్ కింద రైతులకు ఉచిత మొక్కలు, సాగు ప్రోత్సాహకాలు, పరికరాలపై భారీ రాయితీలు అందిస్తూ ఆయిల్ పామ్‌ను రాష్ట్రంలో భవిష్యత్తు పంటగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ఆప్షన్ త్రీ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి..

**విస్సాకోడేరు లే అవుట్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్...**

**ఉగాది నాటికి విస్సాకోడేరు లే అవుట్ లోని 1,900 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి..**

**ప్రస్తుతం స్లాబ్ కంప్లీట్ అయిన 120 ఇళ్లకు గోడల నిర్మాణాలను పూర్తి చేయాలి..**

**వివిధ దశల్లో ఉన్న 575 గృహాలు స్టేజ్ కన్వర్షన్ కు పనులను వేగవంతం చేయాలి..**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**





**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 5 నంది పత్రిక** పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో ఇళ్ల నిర్మాణాల లేఅవుట్ ను గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొత్తం ఎన్ని ప్లాట్ లు, ఎన్ని ఇళ్ళు మంజూరు అయ్యాయి, ఎన్ని ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యాయి, మిగతావి ఏయే దశలలో ఉన్నాయి అని ఆరా తీశారు. ఆప్షన్ త్రీ క్రింద 3,600 ప్లాట్స్ కు గాను 2,150 ఇళ్ళు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పటివరకు 231 గృహ నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. రామన్న ఉగాది నాటికి 1,900 ఇళ్ళ నిర్మాణాల లక్ష్యంగా పూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్ పల్లా ఏసుబాబును ఆదేశించారు. ఇప్పటికే స్లాబులు పూర్తి చేసిన 120 ఇళ్లకు గోడలు పూర్తిచేసి అప్పగించాలన్నారు. వివిధ నిర్మాణ దశలో ఉన్న 575 గృహాలకు సంబంధించి తదుపరి పనులను వేగవంతం చేయాలన్నారు. తొలుత కాలనీ అంతా కలియతిరిగి ఇప్పటికే నివాసం ఉంటున్న కొన్ని కుటుంబాలతో మాట్లాడారు. దశలవారీగా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. రోడ్డు ఇబ్బందిని పరిశీలించి క్వారీ రబ్బిష్ తో ఇప్పటికే నిర్మించిన 3 కిలోమీటర్ల నిడివి గల రోడ్డుపై మరొక లేయర్ గ్రావెల్ తో నిర్మించాలని భీమవరం మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. ప్రభుత్వం ఇళ్ళ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఉగాది నాటికి లక్ష్యాన్ని పూర్తి చేసి లబ్ధిదారులతో గృహప్రవేశాలను చేయించాల్సి ఉందని తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా గృహ నిర్మాణాధికారి జి.పిచ్చయ్య, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, టౌన్ సర్వేయర్ రమా బాయి, ఏటీపీ శ్రీలక్ష్మి, హౌసింగ్ డిఈ శ్రీరామరాజు, ఎ.ఈ శ్రీరామచంద్రమూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ బి.ఇస్మాయిల్, కాంట్రాక్టర్ పల్లా యేసుబాబు, తదితరులు ఉన్నారు.



# జనరల్ కేటగిరిలో 7 మద్యం బార్లు

## (2026-28) లాటరీ పద్ధతి ద్వారా కేటాయింపులు






### జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆధ్వర్యంలో నిర్వహించిన లాటరీ ప్రక్రియ

**ఏలూరు బ్యూరో చీఫ్ ఫిబ్రవరి 5 నంది పత్రిక**రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జిల్లాలో కేటాయించిన 7 మద్యం బార్లకు 28 ధరఖాస్తులు రాగా బార్ల కేటాయింపులు పక్రియను అర్జీదారులు సమక్షంలో అత్యంత పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరు జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో గురువారం ఏలూరు జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రభుత్వం కేటాయించిన 7 మద్యం బార్లుకు 28 ధరఖాస్తులు రాగా బార్లు కేటాయింపులు పక్రియను అర్జీదారులు సమక్షంలో నిబంధన మేరకు పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా పూర్తి చేశామని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు ప్రోహిబిషన్ & ఎక్సైజ్ శాఖ స్టేషన్ పరిధిలో 6 బార్లు, జంగారెడ్డిగూడెం ప్రోహిబిషన్ & ఎక్సైజ్ శాఖ స్టేషన్ పరిధిలో 1 బారు మొత్తం 7 బార్లకు 28 ధరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 202628 మూడు సంవత్సరాలకు సంబంధించి బార్ల కేటాయింపులకు లాటరీ ప్రక్రియ ధరఖాస్తుదారులు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ నియమ, నిబంధనలు మేరకు పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలో లాటరీ పద్ధతిలో 7 బార్లును దక్కించుకున్న వారి జాబితా 1,బసు సాంబశివరావు 2, ఎరకల నాగ వెంకట కామాక్షి 3, సుంకర శ్రీదేవి 4, తల్లూరి శివ రామారావు 5, ఎర్రగోగు భాను ప్రకాష్ 6, ఆరేపల్లి సంతోష్ కుమార్ 7, మద్దుల జగదీశ్వర వేణుగోపాల్ లు ఉన్నారు. లాటరీ నిర్వహణ ప్రక్రియలో జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమీషనరు బి.శ్రీలత, జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి ఏ.ఆవులయ్య, ఎక్సైజ్ శాఖ సిఐలు జి.శ్రీకృష్ణ ధనరాజు, కె.శ్రీనుబాబు, ఎక్సైజ్ శాఖ, పోలీసు అధికారులు, సిబ్బంది, బార్ల దరఖాస్తుదారులు , తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోపుగా పట్టాదారు పాసుపుస్తకాలు వెరిఫికేషన్, ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**





**ఉండి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 5 నంది పత్రిక** పట్టాదారు పాసు పుస్తకం వెరిఫికేషన్, ఈకేవైసీ ప్రక్రియ ను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు. గురువారం ఉండి తహసిల్దార్ కార్యాలయంను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పట్టాదార్ పాస్ పుస్తకాలు వెరిఫికేషన్, ఈకేవైసీ ప్రక్రియ నిర్ణీత గడువులోపుగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు కీలకమైన పట్టాదార్ పాస్ పుస్తకములు ఎలాంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇప్పటివరకు జరిగిన పట్టాదార్ పాసు పుస్తకములు వెరిఫికేషన్ వివరాలు, పెండింగ్ దరఖాస్తులు, ఈకేవైసీ పూర్తికాని పాస్ పుస్తకాలు వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. వీఆర్వోలు రైతులతో నేరుగా సంప్రదించి పట్టాదారు పాసు పుస్తకాలకు సంబంధించి ఈకేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆధార్, భూమి వివరాలు, హక్కులు నమోదు వంటి అంశాలను జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి తప్పులు జరగకుండా బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కె.నాగార్జున, డిప్యూటీ తహసిల్దార్ సూర్యనారాయణ రాజు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు, విలేజ్ సర్వేలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో అప్సడా రిజిస్ట్రేషన్స్ వేగవంతంగా పూర్తి చేయాలి.

## అప్సడా రిజిస్ట్రేషన్ ద్వారా ఆక్వా రైతులకు కలిగే ప్రయోజనాలపై విస్తృతమైన అవగాహన కల్పించాలి. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 5 నంది పత్రిక** జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి గురువారం అప్సడా రిజిస్ట్రేషన్ల ప్రగతిపై మండలాల వారీగా మత్స్య శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఎఫ్ డి ఓ లుతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అప్సడా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి ఫిబ్రవరి 10వ తేదీ నాటికి నూరు శాతం పూర్తి చేయించాలని మత్స్యశాఖ అధికారులు, ఎంపీడీవో లను ఆదేశించారు. అప్సడా రిజిస్ట్రేషన్ల ద్వారా కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొన్ని మండలాలలో అప్సడా రిజిస్ట్రేషన్ల ప్రగతి ముందుండగా, వెనుకబడిన గణపవరం, వీరవాసరం, ఆకివీడు, పాలకొల్లు మండలాల ఎంపీడీవోలు, ఎఫ్డిఓలతో మాట్లాడి కారణాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలో శ్రద్ధ చూపని పెద్ద రైతులకు నోటీసులు ఇచ్చి వారికి అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ద్వారా లభించే ప్రయోజనాలపై తయారుచేసిన స్లైడ్స్ ప్రచారం ద్వారా రైతులకు అవగాహన కలిగిందని, మంచి స్పందన లభిస్తుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం మంచి వాతావరణం ఉందని టాక్స్ లు తగ్గడం ద్వారా ఆక్వా ఉత్పత్తులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుంది అన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నూరు శాతం రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ గూగుల్ మీట్ లో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ సురేష్, సహాయ సంచాలకులు ఎల్ఎల్ ఎన్ రాజు, ఎంపీడీవోలు, ఎఫ్ డి ఓ లు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్స్, తదితరులు పాల్గొన్నారు.





శ్రీ జ్వాల నరసింహ స్వామి ప్రహ్లాద వరద స్వాములకు కొలువుదీరిన ఉత్సవ పల్లకి పూజలు నిర్వహించిన ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి ఎంపీడీవో నూర్జహాన్ బేగం

# ఉత్సవ పల్లకి కి స్వాగతం పలికిన డీఎస్పీకే ప్రమోద్ భావన దంపతులు





## చింతకుంట చేరుకున్న ఉత్సవ పల్లకి

ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 5, నంది పత్రిక అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పారువేట ఉత్సవాలలో భాగంగా గురువారం అహోబిలేశ్వరుల ఉత్సవ పల్లకి ఉయ్యాలవాడ మండలం సర్వాయి పల్లె నుండి తిరిగి ఆళ్లగడ్డ పట్టణానికి చేరుకుంది. ఆళ్లగడ్డ పట్టణంలోని గాయత్రి మాత ఆలయం వద్ద భక్తులతో పూజలు అందుకోగానే నేరుగా ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకుంది. అక్కడ ఎంపీడీవో నూర్జహాన్, ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, సబ్ రిజిస్ట్రార్ చైతన్య రాయల్, కార్యాలయ అధికారులు సాంప్రదాయ బద్ధంగా పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి పల్లకి ఫైర్ స్టేషన్ కు చేరుకొని పూజలు అందుకుంది. అనంతరం శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీ ప్రహ్లాద వరద స్వాములు కొలువుతీరిగిన ఉత్సవ పల్లకి డిఎస్పి కార్యాలయం వద్దకు చేరుకోగానే

డి.ఎస్.పి ప్రమోద్ భావన దంపతులు, పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది ఎదురేగి ఘనంగా స్వాగతం పలికి పల్లకిని మోసి, పూజలు నిర్వహించారు. అనంతరం ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చింతకుంటకు అహోబిలేసుడి ఉత్సవ పల్లకి చేరుకున్న వెంటనే గ్రామస్థులు, వీఆర్వో మేళ తాళాలతో భాజా భజంత్రీలు ఎదురుగా ఘనంగా స్వాగతం పలికారు. నరసింహ స్వామి గోవిందా అంటూ భక్తుల ఆనంద ఉత్సవాల మధ్య చింతకుంట తిరునాళ వాతావరణం నెలకొంది.





## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

### బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోగయ్య

వెల్దండ ఫిబ్రవరి 05 ప్రతినిధి /రామానుజన్: మండల కేంద్రానికి చెందిన పుట్ట యాదయ్య గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల కన్యాకుమారి జోగయ్య పరామర్శించి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 5 వేల రూపాయలను అందజేశారు. అధైర్య పడకూడదు అండగా ఉంటామని మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్, సీనియర్ నాయకులు చంద్రమోహన్ రెడ్డి, మట్ట శీను, మావిళ్ళ గణేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సేవా సంఘాల ఐక్యకార్యాచరణ సమితి (ఏపీ జేసీసీ అమరావతి) 4వ రాష్ట్ర మహాసభ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగింది. తొలుత జేసీసీ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్ ఆధ్వర్యంలోవేలాది మంది ఉద్యోగులు లెనిన్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు మంత్రులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ఉద్యోగులు కష్టపడి దాచుకున్న డబ్బును గత వైసీపీ ప్రభుత్వం మింగేసిందని ఆర్థిక మంత్రి కేశవ్ అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు నిరంతరం చర్చలు జరుగుతున్నాయన్నారు. కాస్త ఆలస్యమైనా.. ఉద్యోగుల సంక్షేమం కోసం చేయగలినంత చేస్తామని భరోసా ఇచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం సానుకూలతతో ఉందన్నారు. స్త్రీ పథకం ద్వారా వైద్య ఆరోగ్య శాఖకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈహెచ్ఎసను అప్‌డేట్ చేసి ఉద్యోగులకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 18 నెలల్లో జరిగే క్లయిమ్‌లను మూడు నెలలకు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

బకాయిలన్నీ క్లియర్ చేయండి సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు పలు డిమాండ్లను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. పీఆర్సీ కమిషనర్‌ను నియమించి వెంటనే ఐఆర్ ప్రకటించాలని, డీఏ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, దీనిలో తొలి ప్రాధాన్యత పెన్షనర్లకు ఇవ్వాలని, 11వ పీఆర్సీ ఎరియర్స్‌ను ఆలస్యం లేకుండా విడుదల చేయాలన్నారు. జీపీఎఫ్ మొత్తాల నుంచి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, సరెండర్ లీవ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. జేసీసీ తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.



## ఎక్కడికెళ్లినా అదే రచ్చ



పరామర్శ అయినా, పెళ్లి వేడుక అయినా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అభిమానులు, ఆ పార్టీ కార్యకర్తలు ఒకేలా వ్యవహరిస్తున్నారు. ఆయన ఎక్కడికెళ్లినా రచ్చ రచ్చ చేస్తున్నారు. గురువారం ఉదయం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని పెద అమిరంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు కుమారుడి వివాహం జరిగింది. ఈ కార్యక్రమానికి జగన్ ఉదయం 11.15 సమయంలో హాజరయ్యారు. ఇది తెలిసి ఆయన అభిమానులు అక్కడ గుమిగూడారు. జగన్ కళ్యాణ వేదిక వద్దకు వెళ్లిన సమయంలో వారిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అయితే అక్కడ ఏర్పాటు చేసిన స్టీల్ బారికేడ్లను నెట్టేసి కల్యాణ మండపంలోకి దూసుకెళ్లారు. పులివెందుల పులి, సీఎం జగన్ అంటూ కల్యాణం మండపంలో జగన్ ఉన్నంత సేపూ పెద్దపెట్టున నినదిస్తూనే ఉన్నారు. హెలిప్యాడ్ వద్ద కార్యకర్తల హడావుడి లేకపోయినా, కల్యాణ వేడుక ప్రాంగణంలో మాత్రం కార్యకర్తలు హంగామా చేశారు.

## ఏప్రిల్- మేలో రాష్ట్రంలో ఎస్ఐఆర్

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తెలంగాణలో ఏప్రిల్–మేలో చేపట్టే అవకాశం ఉందని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈఓ) సుదర్శన్‌రెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ వచ్చాక సమయం తక్కువగా ఉంటుందని, అందుకే ముందస్తు సన్నాహకాల్లో భాగంగా 2025 ఓటర్ల జాబితాను 2002 ఎస్ఐఆర్ ఓటర్లతో



అనుసంధానించే 'టేబుల్ టాప్ మ్యాపింగ్' పూర్తి చేశామని చెప్పారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. డూప్లికేట్‌లు, తప్పుల్లేకుండా కచ్చితమైన ఓటరు జాబితా సిద్ధం చేయాలంటే బూత్‌స్థాయిలో పటిష్టమైన నిఘా అవసరమని, రాష్ట్రంలోని ప్రతి పోలింగే స్టేషన్‌కు ఒక బూత్‌లెవల్ ఏజెంట్‌ను(బీఎల్ఏ) రాజకీయ పార్టీలు తక్షణమే నియమించాలని సూచించారు. ఎస్ఐఆర్ సమయంలో బీఎల్ఓలు ప్రతి ప్రాంతాన్ని 3 లేదా 4 సార్లు సందర్శిస్తారని, మొదటి విడతలో ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, అందుబాటులో లేని కుటుంబాల కోసం తదుపరి సందర్శనలు ఉంటాయన్నారు. సన్నాహక దశలో పేరు నమోదు కానివారు కూడా ఎస్ఐఆర్ సమయంలో వివరాలు సమర్పించవచ్చని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు.

## ఏకీకృత కుటుంబ సర్వే ప్రక్రియను వేగవంతం చెయ్యాలి.

### ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించాలి. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.



భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 5 నంది పత్రిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి గురువారం ఏకీకృత కుటుంబ సర్వేపై ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గూగుల్ మీట్ ద్వారా మండలాల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏకీకృత కుటుంబ సర్వే పురోగతిలో ఉన్న, ఇతర జిల్లాలతో పోలిస్తే కొంత వెనుకబడి ఉందన్నారు. జిల్లాలో 6,30,791 గృహాలు సర్వే చేయవలసి ఉండగా ఇప్పటి వరకు 1,37,274 గృహాలు సర్వే పూర్తయిందని 4,93,517 గృహాలు సర్వే పూర్తి చేయవలసి ఉందని, అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించింది అన్నారు. ప్రభుత్వ పథకాలు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. తాను క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే ప్రక్రియలో భాగంగా లబ్ధిదారుని వివరాలు సేకరించి సంబంధిత డాక్యుమెంట్లు వాట్సాప్ అప్లికేషన్ లో స్వయంగా అప్లోడ్ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఎంపీడీవోలు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియలో పాల్గొంటే ఏమైనా ఇబ్బందులు ఉంటే అవగాహన కలుగుతుంది తద్వారా సిబ్బందితో సర్వే ప్రక్రియను వేగవంతం చేయవచ్చు అన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి వై.దోసి రెడ్డి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా నిలిచిన అంజి మాస్టర్



వెల్దండ ఫిబ్రవరి 05 ప్రతినిధి/ వెల్దండ మండల పరిధిలోని సిలోన్ బావి తండా కు చెందిన మూడావత్ లచ్యా నాయక్ అనారోగ్యం తో గురువారం ఉదయం మరణించడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ పోతే పల్లి ఎంపీటీసీ అభ్యర్థి మండల యువ నాయకులు, తగుళ్ళ అంజి మాస్టర్ తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా యువ నాయకులు లచ్చిరాం నాయక్ రూ. 2 వేల ఐదు వందల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తుకారం నాయక్, చెందిన నాయక్, రవి నాయక్, హేమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

వెల్దండ ఫిబ్రవరి 5 ప్రతినిధి/: కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 19వ వార్డు ఇన్చార్జిగా వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ గురువారం 19వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ సోఫీ గెలుపు కోసం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. మహమ్మద్ సోఫిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు తెలపాలని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ ఉప సర్పంచ్ బస్నమోని రామకృష్ణ, వార్డు సభ్యులు మసిగుండ్ల వెంకటేష్, సీనియర్ నాయకులు కొయ్యల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు



## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం.

### మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ యాదవ్

వెల్దండ ఫిబ్రవరి 05 వెల్దండ మండల పరిధిలోని సీలోన్ బావి తండాకు చెందిన మూడావత్ లచ్యా నాయక్ అనారోగ్యం తో గురువారం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 5 వేల రూపాయలు అందజేశారు. అదేవిధంగా గిరిజన సంఘం మండల అధ్యక్షులు అజిత్ నాయక్ రూ. 5 వేలు, అల్లంతోట బావి తండా సర్పంచ్ రోజా అరుణ్ నాయక్ రూ. 5 వేలు, సిలోని బండ తండా ఉపసర్పంచ్ రవి నాయక్ రూ. 3 వేలు, వార్డు సభ్యులు రాము నాయక్ రూ. 2 వేల ఐదు వందల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టాక్యయా నాయక్, సూర్య నాయక్, మంగ్య, రమేష్ నాయక్, భీమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# మోహన్ బాబు వర్సిటీలో సినిమా తరహా శిక్షలా ?

నటుడు మోహన్ బాబు విద్యాసేవ ఎలాంటిదో బట్టబయలు అయ్యింది. పైకి నీతి సూత్రాలు వల్లిస్తూ.. జలగల్లా పీక్కుతుంటున్న తీరు వెలుగుచూసింది. తను పేదలకు ఉచితగా విద్యను అందిస్తున్నానని చెబుతున్న బాంబికపు మాటలు ఉత్తవే అని తేలింది. ఇదంతా ఒక ఎత్తయితే ఇటీవల ఓ విద్యార్థి ఆత్మహత్య మరింత కలకలం రేపుతోంది. ఇక్కడి అవినీతిపై ప్రశ్నించిన విద్యార్థులను కిడ్నాప్ చేయించడం చూస్తే మోహన్‌బాబు ఆయన తనయుడు ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు. నిజానికి కార్పోరేట్ కళాశాలల అవినీతి కథలు అనకొండలా బుసలు కొడుతున్నాయి. అనుమానాస్పద మరణాలు, ఆత్మహత్యలపై ప్రభుత్వాలు కిమ్మనడం లేదు. నయా ఆర్థిక విధానాల పుణ్యమా అని కార్పొరేట్ల చేతుల్లో చిక్కుకున్న విద్యావ్యవస్థకు ఇప్పటికే లాభార్జన ప్రధానంగా మారింది. అక్కడి నుండి తమ ఖజానాలు నింపుకోవడానికి, ఎంతటి దారుణమైనా చేసే మాఫియా ముఠాల స్థాయికి కార్పొరేట్ విద్యా వ్యవస్థ దిగజారుతున్న తీరుకు తాజా పరిణామం ఒక నిదర్శనం. ఇది ఒక్క మోహన్ బాబుకే పరిమితం కాదు. ఇప్పుడు మోహన్‌బాబు వ్యవహారం బయపడింది. గతంలో నారాయణ, శ్రీచైతన్య స్కూళ్లు, కాలేజీల్లో వందలమంది పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అనుమానాస్పద మృతి చెందారు. ఇవన్నీ బయటకు రాకపోవడానికి ఘనత వహించిన పాలకుల తీరే కారణం. ఇక మోహన్ బాబు విద్యాసంస్థల వ్యవహారానికి వస్తే..ఫీజుల దందాపై గళమిప్పిన ఎస్ఎఫ్ఐ నేతలను కిడ్నాప్ చేయడానికి తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్శిటీ యాజమాన్యం బరితెగించిన తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. బౌన్సర్లతో విద్యార్థి నేతలను బలవంతంగా ఎత్తుకుపోవడం, వారిపై అమానుషంగా దాడి చేయడం వంటి చర్యలు ఆ విశ్వవిద్యాలయంలో నేరాలు వ్యవస్థీకృతమైన తీరుకు, యాజమాన్య నేర ప్రవృత్తికి నిదర్శనాలు. సినిమాలో విలన్‌లా మోహన్ బాబు నిజజీవితంలో కూడా వ్యవహరించారన్న ఆరోపణలకు సమాధానం చెప్పుకోవాలి. విద్యాసంస్థల్లో సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేయడం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం సహజ పరిణామమే. మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో జరిగింది కూడా ఇదే! కానీ, విద్యాసంస్థ యాజమాన్యం అన్ని పరిధిలను అతిక్రమించి ప్రశ్నించిన వారిని ఎత్తుకెళ్లి, భౌతికదాడులు చేసి, అంతం చేసేలా వ్యవహరించడం ఖచ్చితంగా బరితెగింపునకు నిదర్శనం. సొంత జిల్లాలో ఇంతటి దారుణం జరిగినా సిఎం చంద్రబాబు ఇష్టపి వరకు నోరు మెదపలేదు. దీనిగురించి ఆరా తీయలేదు. మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఫీజుల దందాపై దుమారం రేగడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ అధిక ఫీజుల వసూలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆరోపణలు వచ్చాయి. రకరకాల పేర్లతో సాగిన ఫీజుల దందా శృతి మించడంతో నియంత్రణ సంస్థల జోక్యం, కోర్టుల దాకా ఈ వివాదాలు వెళ్ళాయి. దాదాపు 26 కోట్ల రూపాయలను యాజమాన్యం అక్రమంగా వసూళ్లు చేసినట్లు ఉన్నత విద్యామండలి నిర్ధారించింది. అక్రమ వసూళ్లకు పాల్పడటంతో 15 కోట్ల రూపాయల జరిమానాను ఉన్నత విద్యామండలి విధించింది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ కష్టార్జితాన్ని వెనక్కి తీసుకోవడానికి పోరాటం కొనసాగించారు. మరోసారి ఉన్నత విద్యామండలిని ఆశ్రయించారు. ఇది యాజమాన్యానికి నచ్చలేదు. యూనివర్శిటీ ప్రాంగణానికి వారిని పిలిపించి మోహన్‌బాబు కుమారుడు మంచు విష్ణు బౌన్సర్లతో దాడి చేయించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేసే విద్యార్థి సంఘాలు సహజంగానే ఈ దౌర్జన్యంపై దృష్టి సారించింది. విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ఆందోళన చేపట్టింది, ఇది నచ్చని మోహన్‌బాబు యూనివర్శిటీ యాజమాన్యం విద్యార్థులను బెదిరించడానికి మాఫియా అవతారమెత్తి కిడ్నాప్‌లకు, దాడులకు దిగడం అమానుషం.వివాదం ప్రారంభమైన వెంటనే యాజమాన్యం సంయమనం పాటించి, విద్యార్థులతోనూ, వారి తల్లిదండ్రుల తోనూ చర్చించి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదు. బయటకు నీతి వాక్యాలు చెప్పే మోహన్ బాబు తన యూనివర్సిటీలో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సింది. కానీ ఆయనకూడా మైనంగా ఉండడం చూస్తుంటే ఇదంతా తెలిసీ చేస్తున్నారనే ప్రచారం సాగింది. విద్యార్థుల నిరసనను అణచివేయాలన్న దృష్టిలో దాష్టీకాలకు తెగించడం సరికాదు. విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య హక్కు. నా యూనివర్ఇసటీ ఇది అని చెప్పడానిక కుదరదు. తాజా వ్యవహారంలో వెంటనే పోలీసులు స్పందించిన తీరు ప్రశంసనీయం. తక్షణమే వారు స్పందించకుంటే బౌన్సర్ల నిర్బంధంలో ఉన్న విద్యార్థి నేతల పరిస్థితి మరింత ఘోరంగా మారి ఉండేది. ఈ వ్యవహారంలో ఇప్పటికే విశ్వవిద్యాలయ పిఆర్‌ఓ సతీష్, మోహన్‌బాబు, మంచు విష్ణులపై కేసులు నమోదయ్యాయి. విచారణ పక్రియను వేగంగా పూర్తి చేసి, కిడ్నాపర్లు, వారి వెనుక వున్న వారిని కఠినంగా శిక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న మోహన్‌బాబు యూనివర్శిటీని బ్లాక్ లిస్టులో పెట్టాలి. వారి తల్లిదండ్రుల నుండి అక్రమంగా వసూలు చేసిన కోట్లాది రూపాయల మొత్తాన్ని వెనక్కి ఇప్పించాలి. విద్యా సంస్థలు మాఫియా ముఠాలుగా మారకుండా, సామాజిక బాధ్యతతో పని చేసేలా, ఫీజులు, సదుపాయాలు, భద్రత వంటి అంశాల్లో అత్యంత పారదర్శకంగా వ్యవహరించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! అందుకు చంద్రబాబు ప్రభుత్వం తక్షణం పూనుకోవాలి. విద్యార్థులకు అండగా ఉన్నామని నిరూపించాలి.

# గజ్వేల్ ఘనత చాటుదాం





## మళ్లీ బిఆర్ఎస్‌నే గెలిపద్దాం

### మున్సిపల్ ప్రచారంలో హరీష్ రావు పిలుపు

కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధి ప్రదాత అని గజ్వేల్‌లో బీఆర్ఎస్‌ను మళ్ళీ గెలిపించుకోవాలని ఆ పార్టీ నేత, సిద్దిపేట ఎ÷-మెల్యే హరీష్‌రావు అన్నారు. చెప్పారు. 'కేసీఆర్ రాకముందు గజ్వేల్ ఎట్లుండే..? ఇప్పుడు ఎట్లుందన్నది ఆలోచించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్‌లో హరీష్‌రావు పర్యటించారు. అక్కడ పార్టీ శ్రేణులు నిర్వహించిన భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన అభివృద్ధిని, రేవంత్‌రెడ్డి వైఫల్యాలను ఎండగట్టారు. 'గజ్వేల్‌లో ఎన్నికలు వచ్చాయి. మనకు అన్నం పెట్టిన వాళ్లకు, మనకు పని చేసిన వాళ్లకు, మనల్ని మంచిగా చూసుకున్న వాళ్లకే ఓటేయాలి. సద్దితిన్న రేవు తలవాలి' అని చెప్పారు. ప్రజ్ఞాపూర్-గజ్వేల్ రోడ్డు అప్పుడు ఎట్లుండే..? ఆ రోజు గజ్వేల్ దవాఖాన పందులకు నిలయంగా ఉండేది. ఈ రోజు 250 పడకల ఆసుపత్రి తెచ్చి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించింది కేసీఆర్. గజ్వేల్‌కు ఆర్డీవో ఆఫీస్, రైలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఊర చెరువు, పాండవుల చెరువు సుందరీకరణ చేసింది కేసీఆర్ కాదా..? కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డ పెళ్లికి 1,00,116 అందించి మేనమామలా ఆదుకున్నది కేసీఆర్. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవిస్తే కేసీఆర్ కిట్‌తోపాటు 13,000 అందించిన ఘనత కేసీఆర్‌ది' అన్నారు. 'మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ బిడ్డల కోసం గురుకులాలు స్థాపించి చదువుల విప్లవం తెచ్చింది కేసీఆర్. ఒకప్పుడు గజ్వేల్‌లో మూడు రోజులకోసారి నీళ్లు వచ్చే పరిస్థితి పోయి.. ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీళ్లు అందించారు. బిందెలు

పట్టే కష్టం లేకుండా చేసి, మహిళల కష్టాలు తీర్చింది కేసీఆర్. రైతుబంధు ఎందుకు వేయలేదు అంటే ఎలక్షన్ అయ్యాక ఇస్తా అంటున్నాడు రేవంత్. కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ 11 సార్లు రైతుబంధు ఆపలేదు. ఇంటింటికీ బియ్యం, మందులు పంపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఇప్పటికీ రెండు రైతుబంధులు ఎగ్గొట్టిండు. ఇది మూడోది. ఎగ్గొట్టిన రెండు, ఇప్పుడు రావాల్సిన ఒకటి కలిపి మూడు రైతుబంధులు వెంటనే వేయాలని డిమాండ్ చేస్తున్నాం. కావాలంటే మాకు అభ్యంతరం లేదని ఎలక్షన్ కమిషన్‌కు మేమే లేఖ ఇస్తాం. 11వ తేదీలోగా రైతుబంధు వేయకపోతే రైతులు నిన్ను చీల్చి చెండాడుతారు' అని హరీష్‌రావు హెచ్చరించారు. 'త్యాగాలతో, ఆమరణ దీక్షతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు, తెలంగాణ జాతిపిత కేసీఆర్. రేవంత్ రెడ్డి నోరు తెరిస్తే చాలు బూతులు మాట్లాడే బూతుల పిత. ఎంతో కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను రేవంత్ రెడ్డి ఆగమాగం చేస్తుండు. సర్వనాశనం చేసిండు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి.. పెన్షన్ అడిగితే లాగుల తొండలు వదులుతా, హామీలు అడిగితే పేగులు మెడలో వేసుకుంటా అంటాడు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి వచ్చానని చెప్పుకునే రేవంత్ రెడ్డి బుద్ధి.. కుక్క తోక వంకర అన్నట్టే ఉంది. గతంలో రూ. 400 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేసింది కేసీఆర్. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి సగం కాలం గడిచినా ఒక్క రూపాయి పెంచలేదు. ఇప్పటివరకు ఒక్కో అవ్వతాతకు రూ.52,000 ప్రభుత్వం బాకీ పడింది' అని చెప్పారు. 'మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నాడు. ఎవరికైనా వచ్చిందా..? ఫ్రీ బస్సు అని మగోళ్లకు డబుల్ టికెట్ కొట్టి, ఆడవాళ్లకు తిప్పలు పెట్టారు. పువ్వు గుర్తు వాళ్ళు ఎన్నడైనా ఒక్క రూపాయి పని చేశారా..? అక్షింతలు పంచడం తప్ప ఏమైనా చేశారా..? యాదాద్రి నరసింహ స్వామి గుడి కట్టింది కేసీఆర్. గజ్వేల్ వెంకటేశ్వర స్వామి గుడి, రామాలయం, శివాలయం అద్భుతంగా కట్టించింది కేసీఆర్. పనిచేసే వాళ్లకు ఓటేద్దామా..? అక్షింతలు వేసే వాళ్లకు ఓటేద్దామా..? కేసీఆర్ ముస్లిం మైనార్టీ పిల్లల చదువు కోసం ఆలోచించి రెసిడెన్షియల్ స్కూల్స్ పెట్టారు. షాదీ ముబారక్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వచ్చాక మైనార్టీల కోసం ఒక్క రూపాయి పనిచేశారా..? ఎరువు బస్తాలు ఇచ్చే తెలివి లేదు. చేతగాని దద్దమ్మ రేవంత్ రెడ్డి' అని హరీష్‌రావు మండిపడ్డారు. రేవంత్‌రెడ్డీ నువ్వు కేసీఆర్‌ని తిడతావా..? నీ మొఖానికి పండిన వడ్లు కొనే తెలివిలేదు. దళితబంధు బంద్ పెట్టి రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నావు. మన తెలంగాణను కాపాడు కోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటేయాలి. ఇప్పుడు గెలిచిన కౌన్సిలర్లు ఐదేళ్లు ఉంటారు. రెండేళ్లలో వచ్చేది మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వమే. ప్రజ్ఞాపూర్ గౌరవం నిలబడాలంటే బీఆర్ఎస్ గెలవాలి' అని చెప్పారు. వంటేరు ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## కల్తీనెయ్యి..లడ్డూ గట్టిదనం గురించి ప్రశ్నిస్తే ఆర్గానిక్ నెయ్యి పేరుతో బురిడీ కొట్టించారు

### తిరుమల కల్తీపై మరోమారు మంత్రి పయ్యావుల విమర్శలు

శ్రీవారి లడ్డూ కల్తీ విషయంలో అనుమానాలపై వాస్తవాలు చెబుతున్నామని ఏపీ ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. వేంకటేశ్వర స్వామి లడ్డూ గట్టిగా ఉందని, సువాసన లేదని భక్తులు గతంలో తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అప్పటి ఈవో ధర్మారెడ్డికి పోటు కార్మికులు చెపితే.. ఆర్గానిక్ నెయ్యి అలానే ఉంటుందని చెప్పారని ప్రస్తావించారు. ఈవో తన విధి నిర్వహణలో భాగంగా శాంపిల్స్ పంపారని గుర్తు చేశారు. రిపోర్టుతో అందరు నివ్వెరపోయారన్నారు. కల్తీ జరిగినట్లుగా నివేదిక వచ్చిందని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. గురువారం ఆయన అమరాతి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఆ విషయాలను ప్రజల ముందు పెట్టారని, నాటి రిపోర్టును వివరించారని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 'ఈ కల్తీ వ్యవహారాన్ని తేల్చడానికి సిట్‌ను ఏర్పాటు చేశాం. దీనిలో మరో ఇద్దరు అధికారులను యాడ్ చేసి సీబీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేయాలని నిర్ణయించారు. టీటీడీలో ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కటీ తెలిసే జరిగింది. తెలియక కాదు... సీఎఫ్టీఆర్ఐ కూడా మరో నివేదిక ఇచ్చింది. బెటాసిస్టో స్టిరాయ్ దీనిలో ఉన్నట్లు పేర్కొంది. ఇంత తెలిసిన తర్వాత కూడా టీటీడీ మాజీ చైర్మన్ ఈ విషయాన్ని తొక్కిపెట్టారు. 60 లక్షల లీటర్ల కల్తీ నెయ్యి సరఫరా చేశారు, రూ.234 కోట్లు దుర్వినియోగమైంది' అని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. చిన్న అప్పన్న బోలేబాబా డెయిరీ దగ్గరకు వెళ్లి ఈ టెండర్ ఇవ్వాలని కోరారని.. వారు అంగీకరించలేదని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. 'వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. తర్వాత కూడా వారి సంస్థను తీసుకోవడం కుదరదని.. ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీల ద్వారా సరఫరా చేయించారు. కిలోకు రూ.35లు నష్టానికి వారు సరఫరా చేశారు. ఇది వారికి ఎలా సాధ్యమైందో ఆలోచించాలి. రూ.320లకు నెయ్యి ఎలా ఇచ్చారు... బోలే బాబా అనే సంస్థ నెయ్యి అని పిలువబడే నెయ్యిని తయారు చేశారు. పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్‌ను నెయ్యి వాసన వచ్చేలా, రంగువచ్చేలా తయారు చేశారు. బోలేబాబాలో పదిమంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. వీరిలో స్వీపర్లు, వాచ్‌మెన్‌లు కాకుండా ఆరుగురు ఉన్నారని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

## ఇప్పటికే మోసపోయాం.. మళ్లీమళ్లీ మోసపోవద్దు

### సూర్యాపేట పట్టణంలో గులాబీ జెండా ఎగరడం ఖాయం

### రేవంత్ అజ్ఞానంతో చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలి

### బిఆర్ఎస్ నేత, మాజీ జగదీష్‌రెడ్డి పిలుపు

మోసపోతే గోసపడతామని కేసీఆర్ ఎన్నోసార్లు చెప్పిండు. కాంగ్రెస్ మాయగాళ్ళను నమ్మినందుకు నట్టేట ముంచిండ్రు. మరోసారి మోసపోకుండా జాగ్రత్త పడాలి. మున్సిపల్ ఎన్నికల్లో అరాచక కాంగ్రెస్‌ను ఓడించాలి. అభివృద్ధికి కేరాఫ్‌గా ఉన్న బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు పట్టంకట్టాలి. సూర్యాపేట మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరడం ఖాయం అని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు.పుట్టుకతో అజ్ఞానం ఉంటే జ్ఞానం పెరగదని, అందుకు రేవంత్‌రెడ్డే ఉదాహరణ అని జగదీష్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ సభలో రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్తే అందరికీ జ్ఞానం పెరుగుతదని, కానీ రేవంత్‌రెడ్డికి ఉన్న జ్ఞానం పోయిందని అన్నారు. సీఎం స్థాయికి తగ్గట్టుగా కాకుండా దిగజారి మాట్లాడుతున్నాడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సమస్యల మీద మాట్లాడకుండా బూతులు వ్లలెవేస్తున్నడని, ప్రజలకు ఎం చేస్తాడో చెప్పకుండా అర్థంలేని ఆరోపణలు చేయడం సరికాదని జగదీష్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన మోసాలను కప్పిపుచ్చేలా రేవంత్ రోత మాటలు మాట్లాడుతున్నారని, గాంధీలా ఆమరణదీక్ష చేసి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను స్వాతంత్యం÷-ర తెచ్చిన గాంధీతో పోలుస్తూ తెలంగాణ ప్రజలు జాతిపిత అంటున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డికి గతంలో చంద్రబాబు, ఇప్పుడు సోనియా జాతిపితలని, భవిష్యత్తులో మోడీ కూడా జాతిపిత అవుతారేమోనని ఎద్దేవా చేశారు.'రేవంత్ అజ్ఞానంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడు. నల్గొండ జిల్లా పర్యటనలో నిబంధనలకు వ్యతిరేకంగా రేవంత్ శంకుస్థాపనలు చేశాడు. సీఎం జిల్లాకు వస్తే ఏదో ప్రకటిస్తారని ప్రజలు ఆశిస్తారు. కానీ స్థాయి పెరిగినా అవే బూతులు. అర్థంలేని ఆరోపణలు. సీఎం గా రెండేళ్లు గడిచినా రోజురోజుకు సంస్కారహీనత పెరిగిపోతుంది. ఉన్న సమస్యలను పక్కనపెట్టి ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నడు. కాంగ్రెస్ సభల్లో ఆయన రోత మాటలతో బిఆర్ఎస్ కు మరింత బలం పెరుగుతున్నది. కాంగ్రెస్ ది బాగుచేసే పనికాదు చెడగొట్టే పనే' అని జగదీష్‌రెడ్డి విమర్శించారు. 'కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధిని ఆగం చేస్తున్నరు. అభివృద్ధితోపాటు పదేండ్లలో పెంచిన పచ్చదనాన్ని ఎండబెడుతున్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయిండ్రని అన్నారు.

## కాంగ్రెస్‌కు కంచుకోట అనంత: షర్మిల

కాంగ్రెస్ పార్టీకి అనంతపురం జిల్లా దశాబ్దాల కాలం కంచుకోటగా ఉన్నిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర కోసం ఆమె ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ ఆధ్వర్యంలో షర్మిలను ఘనంగా సన్మానించారు. తన యాత్రతో పార్టీకి పునర్వైభవం వస్తుందని అన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడం తనకు ఉత్తేజాన్ని ఇస్తోందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట ప్రధాన కార్యదర్శి సాకే శంకర్, నాయకులు గాజుల వాసు, రామ్‌చరణ్ యాదవ్, ప్రసాద్ రెడ్డి, నరసింహా రెడ్డి, కృష్ణ, మోదిన్ బాషా, షఫి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో ఉంటే కాంగ్రెస్‌కు ప్రచారమేంటి?

### ఎమెల్యే బండ్ల తీరుపై బిఆర్ఎస్ శ్రేణుల విమర్శలు

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి బరితెగించారు. బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ వేస్తే.. తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని, పార్టీ ఫిరాయించలేదని చెప్పుకున్న కృష్ణమోహన్‌రెడ్డి.. ఇప్పుడు కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నాడని స్థానిక బిఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. స్పీకర్ అనర్హత పిటిషన్‌ను కొట్టేయడంతో గద్వాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రచారాన్ని భుజానికి ఎత్తుకుని తిరుగుతున్నారు.

ఇవాళ మున్సిపాలిటీలో తిరుగుతూ కాంగ్రెస్ కరపత్రాలను ఓటర్లకు పంచుతున్నారు. కాంగ్రెస్ పార్టీకే ఓటేయమని ఓటర్లను అడుగుతున్నారు. నిన్న మొన్నటి వరకు అంటి ముట్టనట్లు ఉన్న బండ్ల ఇవాళ బరితెగించి హస్తం గుర్తు ఉన్న కరపత్రాలను బహిరంగంగా పంచడం చర్చనీయాంశంగా మారింది. స్పీకర్ ఇప్పుడైనా కళ్ళు తెరిచి ఫిరాయింపు ఎమ్మెల్యేపై బండ్లపై చర్య తీసుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు శ్రీసిటీ ఉద్యోగుల మృతి

సూళ్లూరుపేట హోలిక్రాస్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ శ్రీసిటీ ఉద్యోగులు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు శ్రీసిటీ ప్రైమరీ ఎలక్ట్రికల్ పరిశ్రమలో పనిచేసే తమిళనాడుకు చెందిన రాజశేఖర్ (33), సూళ్లూరుపేట గాండ్లవీధికి చెందిన గోపిశెట్టి శ్రావణి (31) విధి నిర్వహణ ముగించుకుని మోటారు సైకిల్‌పై వస్తుండగా హోలిక్రాస్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై సూళ్లూరుపేటకు వచ్చేందుకు తిరుగుతుండగా అదేవైపు వస్తున్న కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో వివాహిత శ్రావణి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలపాలై ప్రాణపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న రాజశేఖర్‌ను హైవే మొబైల్ వాహనం ద్వారా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తమిళనాడు ఆరణి ధర్మారంకు చెందిన రాజశేఖర్ సూళ్లూరుపేటలోనే అద్దె ఇంట్లో ఉంటూ రోజూ శ్రీసిటీకి వెళ్లేవాడు. సూళ్లూరుపేటకు చెందిన శ్రావణి కూడా అదే పరిశ్రమలో పనిచేస్తుంది. మంగళవారం నైట్ షిఫ్ట్ కావడంతో డ్యూటీకి వెళ్లింది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com